

RNI NO:TELTEL/ 2023/89546

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక

## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326

రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 368 | పేజీలు : 8 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | మంగళవారం18 మార్చి 2025 | వెల : 4/-

## ప్రభుత్వంపై అందరికీ నమ్మకం కలిగించడమే

# తమ లక్ష్యం



- కేబినెట్ నుంచి మంత్రులను తొలగిస్తేనేనా..
- మంత్రివర్గం నుండి మంత్రులను తొలగిస్తేనే పాలనపై పట్టు ఉన్నట్లా?: రేవంత్ రెడ్డి
- అధికారులను తొలగించి.. బదిలీలు చేస్తేనే.. పరిపాలనపై పట్టు సాధించినట్లా
- ఎలాంటి ఆరోపణలు లేకుండా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తున్నామన్న రేవంత్ రెడ్డి
- పథకాల అమలులో పారదర్శంగా వ్యవహరించాలని ఆదేశించామన్న ముఖ్యమంత్రి
- ఎస్సీ వర్గీకరణ కోసం మూడున్నర దశాబ్దాలుగా

## అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ బిల్లు

- సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు
- రిజర్వేషన్ల సాధనకు తాను నాయకత్వం వహిస్తా
- ఈ బిల్లు కోసం లోక్ సభలో పోరాటం చేయాలని మోదీను కోరతా
- 42 శాతానికి బీసీ రిజర్వేషన్లు పెంచాలని నిర్ణయించి.. ఈ బిల్లు పెట్టాం

హైదరాబాద్

తనకు పరిపాలనపై పట్టు రాలేదని కొందరు అంటున్నారని.. కేబినెట్ నుంచి మంత్రులను తొలగిస్తేనే పట్టు ఉన్నట్లా అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. అధికారులను తొలగించి.. బదిలీలు చేస్తేనే.. పరిపాలనపై పట్టు సాధించినట్లా అని ప్రతిపక్షాలను ఆయన నిలదీశారు. అన్నింటిని సరిదిద్దుకుంటూ వెళ్లడమే తన విధానమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అలాగే ప్రభుత్వంపై అందరికీ నమ్మకం కలిగించడమే తమ లక్ష్యమని ఆయన కుండ బద్దలు కొట్టారు. సోమవారం హైదరాబాద్‌లో తెలంగాణలో రాజీవ్ యువ వికాసం పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..

- మిగతా3లో



## నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రజలను దోచుకుంటోంది

- ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టినప్పటికీ దాని ప్రయోజనాలను ప్రజలకు చేరవేయడం లేదు
- బీజేపీ ప్రభుత్వం ఇంకెన్నాళ్లు ప్రజల నుంచి వసూళ్లకు పాల్పడుతూ వారిని దోచుకుంటుంది
- పెరుగుతున్న ద్రవ్యోల్బణం కారణంగా ప్రజలు కన్నీరు పెట్టుకుంటున్నారు
- కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే

## రాజీవ్ యువ వికాసం పథకం



హైదరాబాద్.

తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో రాజీవ్ యువ వికాస పథకం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. సీఎం రేవంత్ తో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పోరేషన్ చైర్మన్లు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఉన్నాతాధికారలు హాజరయ్యారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగ యువత కోసం పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించింది. సుమారు 5 లక్షల మంది నిరుద్యోగ యువత కోసం రూ. 6వేల కోట్ల రాయితీ రుణాలు ఇవ్వనున్నారు. ఒక్కో లబ్ధిదారుడికి సుమారు రూ. 4 లక్షల వరకూ రాయితీ రుణం కేటాయించే అవకాశం ఉంది. దరఖాస్తులను ఏప్రిల్ 5వ తేదీ వరకూ ఆహ్వానించనున్నారు. ఆపై అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి జూన్ 2 వతేదీన రాయితీ రుణాలను మంజూరు చేయనుంది ప్రభుత్వం.

## 'అంత మాట అంటారా?.. పిల్ల చేష్టలు వద్దు'



- పబ్లిక్‌లో ఏది పడితే అది మాట్లాడాతానంటే ఇక్కడ కుదరదు
- చీఫ్ మినిస్టర్ రాష్ట్రంలో అత్యద్భుతంగా పరిపాలన సాగిస్తున్నారు
- అటువంటి నాయకుడ్ని ఔరంగజేబుతో పోలుస్తారా?
- ఇది కచ్చితంగా ఖండించాల్సిన అంశమే



## ఆడబిడ్డలను అక్రమ కేసులతో జైల్లో వేయడమే ఇందిరమ్మ రాజ్యమా?

- కాంగ్రెస్ చెప్పిన ఇందిరమ్మ రాజ్యం అంటే ప్రజలంతా అదేదో సంక్షేమ రాజ్యం అని భ్రమపడ్డారు
- కేసీఆర్ కంటే ఎక్కువ సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందేమోనని అపోహ పడ్డారు.
- కాంగ్రెస్ ప్రభుత్వం తమను మోసం చేసిందని ప్రజలు అంతా భావిస్తున్నారు
- 420 హామీలను ఇచ్చి తమని మోసం చేసి కాంగ్రెస్ గద్దెనెక్కిందని ప్రజలు తమ ఆక్రోశాన్ని వెలిబుచ్చుతున్నారు

హైదరాబాద్

ఆడబిడ్డలను అక్రమ కేసులతో జైల్లో వేయడమే ఇందిరమ్మ రాజ్యమా..? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులో అరెస్టైన మహిళా జర్నలిస్టులు రేవతి, తన్వి యాదవ్‌లను చంచల్‌గూడ జైల్లో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మా రెడ్డి, ఎమ్మెల్సీలు నవీన్ కుమార్ రెడ్డి, డా. దాసోజు శ్రవణ్ తదితర బీఆర్ఎస్ సీనియర్ నేతలతో కలిసి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

## కొత్త రేషన్ కార్డుల కోసం

# తప్పని నిరీక్షణ

- గణతంత్ర దినోత్సవం రోజున ఎంపిక చేసిన గ్రామాల్లో పంపిణీ
- మిగతా గ్రామాల్లో దరఖాస్తుదారుల ఎదురుచూపులు
- ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసినా ముందుకు సాగని ప్రక్రియ



హైదరాబాద్

గణతంత్ర దినోత్సవాన ఎంపిక చేసిన గ్రామాల్లో రేషన్ కార్డులు పంపిణీ చేసి మురిపించారని, తరువాత ఆ ఊసే ఎత్తడం లేదని దరఖాస్తుదారులు అంటున్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జనవరి 26న జిల్లాలోని 31 గ్రామాల్లో 1066 కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశారు. అప్పటికే కొత్త కార్డుల కోసం జిల్లా వ్యాప్తంగా 81,148 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ లెక్కన 80వేల మందికి పైగా దరఖాస్తుదారులు తమకు కార్డు ఎప్పుడొస్తుందనే ఎదురుచూస్తూనే ఉన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో కొత్తకార్డుల పంపిణీకి బ్రేక్‌పడిందని కొన్నాళ్లపాటు చెప్పుకొచ్చినప్పటికీ.. ప్రస్తుతం కార్డులు అందజేసేందుకు ఏం అడ్డంకి ఉందని దరఖాస్తుదారులు ప్రశ్నిస్తున్నారు. ఏ సంక్షేమ పథకానికైనా ప్రభుత్వం రేషన్ కార్డునే ప్రామాణికం చేయడంతో నూతన కార్డులు జారీ చేయాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది. రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పుల కోసం గత ఎనిమిదేళ్ల కాలంలో పలుమార్లు పౌర సరఫరాలశాఖ

- మిగతా3లో



## కులం గురించి మాట్లాడితే సహించేది లేదు

- ఎవరైనా కుల వివక్ష గురించి మాట్లాడితే సహించేదిలేదన్న నితిన్ గడ్కరీ
- కుల మతాలు, భాష తదితరాల ఆధారంగా సమాజంలో ఎవరిపైనా వివక్ష చూపరాదని సూచన
- కులం, మతం, భాష ఆధారంగా ఎవరూ గొప్పవారు

## కీళ్ల నొప్పుల చికిత్సలో మరో అధ్యాయం

### జాయింట్ ప్రిజర్వేషన్ ప్రోగ్రామ్‌ని ప్రారంభించిన అపోలో

హైదరాబాద్

శస్త్ర చికిత్స అవసరం లేకుండానే కీళ్ల నొప్పులు మాయం చేసే కార్యక్రమాన్ని అపోలో ఆసుపత్రి యాజమాన్యం ఘనంగా ప్రారంభించింది. జూబ్లీహిల్స్ అపోలో ఆసుపత్రిలో మార్చి 17న ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారికి ఇది ఒక వరమనే చెప్పుకోవచ్చు. బాధితుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని శస్త్రచికిత్స అవసరం లేకుండానే దీనిని రూపొందించారు. కీళ్ల నొప్పులు, ఆర్థరైటిస్, వాపు సమస్యలు, స్నాయువు గాయాలతో బాధపడుతున్న రోగుల అవసరాల తీర్చేలా డిజైన్ చేశారు. అసౌకర్యం కలగకుండా, శస్త్ర చికిత్స

- మిగతా3లో




## వందే భారత్ స్పీడ్ వేగం ఎందుకు తగ్గుతోంది?



- హైస్పీడ్ రైలు సగటు వేగం ఎందుకు తక్కువగా ఉంది
- ప్రభుత్వ ప్రణాళిక.. రైలు వేగంతో నడిపేందుకు ఏం చర్యలు తీసుకున్నారు
- రైలు వేగం ఇంజిన్‌పై మాత్రమే ఆధారపడి ఉండదు
- రైలు నడిచే ట్రాక్‌పై సైతం ఆధారపడి ఉంటుంది
- రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్

# బంగారం ధర పెరుగుతుందా... తగ్గుతుందా...



**ముంబై :** బంగారం ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. రానున్న రెండు, మూడు నెలల్లో భారీ సంఖ్యలో పెళ్లిళ్లు జరగనున్నా యి. ఈ క్రమంలో బంగారం ధరలు సామాన్యులను భయపెడుతున్నాయి. ఇంత ధర ఉంటే పెళ్లిళ్ల సమయంలో ఎలా కొనాలంటూ తలలు పట్టుకుంటున్నారు. భారతీయ సంప్రదాయంలో బంగారు ఆభరణాలకు ఉన్న ప్రాముఖ్యత గురించి తెలిసిందే. ముఖ్యంగా పెళ్లిళ్లలో వధూవరులకు బంగారు ఆభరణాలను కచ్చితంగా అలంకరిస్తారు. పెళ్లి కూతురికి అయితే ఎక్కువ మొత్తంగా బంగారు ఆభరణాలు అవసరం. కానీ, ప్రస్తుతం ఉన్న ధరలు చూస్తుంటే.. పెళ్లి పెట్టుకున్న వారి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. మన దేశంలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.90,000కు మించిపోయింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సు బంగారం 3,000 డాలర్లను తాకింది. ఇంత భారీగా పెరిగినా.. త్వరలోనే ధరలు తగ్గుతాయనే ఆశ ఉండేది. కానీ, ప్రస్తుతం ఏమీ చెప్పలేని పరిస్థితి నెలకొంది. ధర ఇప్పట్లో తగ్గదేమో అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పైగా పెళ్లిళ్ల సీజన్ వచ్చేసింది. రోజురోజుకూ ధర పెరగడం చూసి పెళ్లి సంబంధాలు కుదుర్చుకున్న వధూవరుల తల్లితండ్రులు ఆందోళన చెందుతున్నారు. ధర పెరిగి కొనేవాళ్లు కరవయ్యారని, ఆభరణాల వర్తకులు ఆందోళన చెందుతున్నారు. రెండు నెలల క్రితం వరకూ ధర ఇంకా పెరగకపోవచ్చని నిపుణులు అంచనా వేశారు. కానీ డొనాల్డ్ ట్రంప్, అమెరిక అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత టారిఫ్‌లు పెంచడంతో అభివృద్ధి చెందుతున్న దేశాల కరెన్సీలు బలహీనపడ్డాయి.కొన్ని దేశాల్లో ద్రవ్యోల్బణం పెరిగింది. దీంతో ఎంతో భద్రమైన ఆస్తిగా భావించే బంగారానికి డిమాండ్ పెరగడంతో ధర పెరిగింది. 2008లో ప్రపంచ ఆర్థిక సంక్షోభం సందర్భంగా ఔన్సు బంగారం ధర 1,000 డాలర్లకు చేరింది. నాలుగేళ్ల క్రితం కొవిడ్ ముప్పు ముంచుకొచ్చినప్పుడు 2,000 డాలర్లు పలికింది. మళ్లీ ఇప్పుడు 3,000 డాలర్లకు చేరుకుంది. ఆర్థిక సంక్షోభం ముంచుకొచ్చినప్పుడు బంగారం ధర రికార్డు స్థాయికి చేరుతున్నట్లు స్పష్టమవుతోంది. దీనికి తోడు గత కొంతకాలంగా వివిధ దేశాల్లోని కేంద్ర బ్యాంకులు బంగారాన్ని కొని నిల్వ చేస్తున్నాయి. 2022 నుంచి ఏటా 1,000 టన్నులకు పైగా బంగారాన్ని కేంద్ర బ్యాంకులే కొనుగోలు చేశాయి. ఇందులో భారత రిజర్వు బ్యాంకు ముందుంటోంది. చైనాలో రియల్ ఎస్టేట్ రంగం దెబ్బతిని అక్కడి మదుపర్లు ఇటీవల పసిడిని ఎక్కువగా కొంటున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సు బంగారం ధర 3,000 డాలర్ల దగ్గర ఎన్నాళ్లు ఉంటుంది, ఇంకా పెరుగుతుందా, లేక తగ్గుతుందా? అనేది మిలియన్ డాలర్ ప్రశ్నగా మారింది.వర్తకులు, పెట్టుబడి నిపుణులు ఎవరూ దీనికి సమాధానం చెప్పలేకపోతున్నారు. అమెరికా టారిఫ్‌లు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఇతర ప్రతికూల పరిస్థితులు కొనసాగినంత కాలం ధర తగ్గదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. బంగారం ధర భారీగా పెరగడంతో ఆభరణాల వ్యాపారం తగ్గింది. బంగారు ఆభరణాల అమ్మకాలు 70 శాతం తగ్గినట్లు సమాచారం. పాత బంగారం ఇచ్చి కొత్త ఆభరణాలు తీసుకోవడం పెరిగిందని, ఎంతో తప్పనిసరి అయితే తప్పించి కొత్త ఆభరణాలు కొనుగోలు చేయడం తెలుస్తోంది. ప్రస్తుతం అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితుల కారణంగా బంగారం ధర తగ్గే సూచనలైతే కనిపించడం లేదని నిపుణులు అంటున్నారు.

# పందెం గెలిచిన బాలు.. ఇక కృష్ణయ్య బాధ్యత తనదే



మడుగులో నీటికోసం దిగిన తనను మొసలి అమాంతం పట్టుకుని లోపలి ఈడ్చుకెళ్ళిపోతూ తనను హరించేస్తున్న తరుణంలో కన్నీటి పర్యంతమవుతూనే సర్వ శక్తులు ఒడ్డుతూ పోరాడుతోంది. మరోవైపు మొసలికి స్థానబలం ఎక్కువగా ఉండే మడుగులో దాన్ని ఓడించడం గజేంద్రుడికి సాధ్యం కావడం లేదు... దీంతో మొసలితో పోరాడలేక.. దాన్ని ఓడించలేక.. తనను తానూ కాపాడుకోలేక ఆ గజరాజు, మకరాన్ని గెలవడం తనవల్ల కాదు అని అర్థం చేసుకుని తనను రక్షించేది ఈ భూలోకంలో శ్రీహరి ఒక్కడేనని అర్థం చేసుకుని విష్ణుమూర్తిని ప్రార్థించింది. ఈ విధంగా మ్రొక్కింది.

కలఁ డందురు దీనులయెడఁ,
గలఁ డందురు పరమయోగి గణములపాలం
గలఁ డందు రన్ని దిశలను,
గలఁడు గలం డనెడువాఁడు గలఁడో లేఁడో

అని ప్రార్థించగా ఆ క్షణాన శ్రీదేవితో పాలసముద్రంలో శేషతల్పం మీద పయనిస్తున్న శ్రీహరి ఒక్క క్షణం ఆలస్యం చేయకుండా ఉన్న ఫలాన భూలోకానివచ్చి సుదర్శన చక్రంతో మొసలి కంఠాన్ని ఖండించి గజేంద్రుడిని కాపాడాడు. అప్పట్నుంచి గజేంద్రుడు శ్రీ హరి సేవలో ఉంటూ పునీతుడైనాడు. ఇక దక్షిణభారత దేశంలోనే ప్రముఖమైన గురువాయూర్ కృష్ణ మందిరంలో సోమవారం మొదలైన ప్రత్యేక ఉత్సవాలకు రంగం సిద్ధం చేసారు. గురువాయూర్ అంటేనే ఏనుగులకు ప్రసిద్ధి.. సువిశాలమైన కృష్ణ మందిరంలో అంతెత్తున గజరాజులు ఆలయ ప్రాంగణంలో తిరుగుతూ ఉంటాయి. అయితే ఈ ఉత్సవాల సందర్భంగా కృష్ణయ్యను మోసే బాధ్యత కూడా ఆ గజరాజులదే.. కృష్ణయ్య సదరు గజరాజుపై అధిరోహించి ఊరేగింపుగా వెళ్తారు. అయితే ఆలయంలో అన్నీ ఉత్తమోత్తమ జాతికి చెందిన గజరాజులే .. అందులో ఎవరికీ ఈ మహాద్భాగ్యం దక్కుతుంది.. అందుకే ఏటా మాదిరిగానే ఆలయంలో ఒక పోటీ పెట్టారు. దేవి, దేవదాస్, చెంతమరాక్షన్, నందన్.. బాలు అనే కరిరాజుల మధ్య పరుగుపందెం నిర్వహించారు. మొత్తం 12 ఏనుగులను ఈ పోటీకి పరిశీలించగా అందులో బాలుతో బాటు ఐదు ఏనుగులను మాత్రమే ఫైనల్ పోటీకి నిలిపారు. ముందుగా వాటిని స్వచ్ఛమైన నీటిలో స్నానం చేయించి వాటి కంఠాన గణగణమని మోగే గంటలను అలంకరించి ముందుగా దేనికి సంబంధించిన మావటి దాను ముందుగా ఉరుకుతుంటే వారివెనుకనే కరిరాజులు పరుగెత్తాయి. ఈ పందెం చూసేవాళ్లకు కన్నులపంట కాగా వినేవాళ్లకు వీనులవిందు అవుతుంది. ఈ పందెంలో బాలు అనే గజరాజు విజయం సాధించాడు. విజయం తర్వాత, బాలు ఒలింపిక్ పతకం సాధించిన విజేత మాదిరి అందర్నీ విజయగర్వంతో పరికించి చూసి.. తొండం అభివాదం చేసాడు. తరువాత తూర్పు గోపురం గుండా ఆలయంలోకి ప్రవేశించి, గురువాయురప్పన్‌కు భక్తితో ఏడు ప్రదక్షిణాలు చేసాడు. ఆ తరువాత ఈ ఉత్సవాల్లో స్వామిని మోసే బాధ్యత ఈ బాలుకు మాత్రమే దక్కుతుందన్నమాట.. ఈ సందర్భంగా నిర్వహించే పోటీలకు ముందు గజరాజులు వెటర్నరీ డాక్టర్లు ఫిట్నెస్ పరీక్షలు చేస్తారు. అన్నీ బాగున్నాయి అనుకున్నప్పుడే కాసిన్ని ఏనుగులను రంగంలోకి దించి పూర్తి భద్రతనడుమ ఈ పరుగుపందెం నిర్వహిస్తారు. జనం అల్లరికి ఏనుగులు బెదిరిపోయి జనంలోకి వెళ్లే ఇంకేదైనా అవాంఛనీయ సంఘటన జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ ఈ పోటీలు నిర్వహిస్తారు..

# వందే భారత్ స్పీడ్ వేగం ఎందుకు తగ్గుతోంది?



భారతీయ రైల్వే ప్రతిష్టాత్మకంగా వందే భారత్ రైళ్లను తీసుకువచ్చింది. అత్యాధునిక సౌకర్యాలతో పాటు హైస్పీడ్ రైళ్లను పెద్ద ఎత్తున తీసుకువస్తున్నది. అయితే, ప్రస్తుతం ఈ రైళ్ల వేగంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సెమీహైస్పీడ్ రైళ్లను గతంలో ప్రకటించిన వేగంతో నడపడం లేదనే ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో వందే భారత్ రైళ్ల వేగంపై వస్తున్న ప్రశ్నలకు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ సమాధానం ఇచ్చారు. రైలు వేగం తగ్గడానికి గల కారణాలను వెల్లడించారు. పార్లమెంట్‌లో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. హైస్పీడ్ రైలు సగటు వేగం ఎందుకు తక్కువగా ఉందని.. ప్రభుత్వ ప్రణాళిక.. రైలు వేగంతో నడిపేందుకు ఏం చర్యలు తీసుకున్నారు.. పూర్తిస్థాయి వేగంతో నడిపేందుకు ఎంత సమయం పడుతుందని పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. రైలు వేగం ఇంజిన్‌పై మాత్రమే ఆధారపడి ఉండదని రైల్వే మంత్రి పేర్కొన్నారు. రైలు నడిచే ట్రాక్‌పై సైతం ఆధారపడి ఉంటుందని.. రైల్వేలైన్లను మెరుగుపరిచే పని నిరంతరాయంగా కొనసాగుతుందన్నారు. 2014 సంవత్సరంలో రైళ్లు గంటకు 110 కిలోమీటర్లు.. అంతకంటే ఎక్కువ వేగంతో 31వేలకుపైగా కిలో మీటర్ల ట్రాక్‌లో మాత్రమే నడవగలమని చెప్పారు. ప్రస్తుతం 80వేల కిలోమీటర్లకు పెంచామన్నారు. ప్రస్తుతం అంత పరిధిలో మాత్రమే పూర్తిస్థాయి వేగంతో నడవగలవమన్నారు. చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో తయారైన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ గరిష్ఠంగా 160 కిలోమీటర్ల వేగంతో నడిచే సామర్థ్యం ఉంది. కొంతకాలం కిందట ట్రయల్స్‌లో భాగంగా రైలును దాదాపు 180 కిలోమీటర్ల వేగంతోనూ దూసుకెళ్లింది. అయితే, ఇటీవల హైస్పీడ్ రైళ్ల వేగంగాపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 136 వందే భారత్ రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. భారత్‌లో అత్యధిక వేగంతో నడిచే రైళ్లలో వందే భారత్ ఒకటి. వందే భారత్ రైళ్లకు ప్రస్తుతం ప్రయాణికుల నుంచి ఆదరణ లభిస్తున్నది. కొన్ని చోట్ల మినహా మిగతా అన్ని రైట్లలో ఆక్యుపెన్సీ భారీగానే ఉన్నది.

## ‘అంత మాట అంటారా?.. పిల్ల చేష్టలు వద్దు’



**ముంబై:** మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ను ఔరంగజేబుతో పోలుస్తూ ఇటీవల ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలపై ఆ రాష్ట్ర బీజేపీ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రధానంగా మహారాష్ట్ర ప్రెసిడెంట్ హర్షవర్ధన్ సప్కాల్.. ఫడ్నవీస్‌ను ఔరంగజేబుతో పోల్చారు. దీనిపై మహారాష్ట్ర శాసనమండలిలో బీజేపీ మండిపడింది. సప్కాల్ పై కఠినమైన చర్యలు తీసుకోవాలంటూ బీజేపీ శాసనమండలిలో డిమాండ్ చేసింది. ఆదివారం ఒక ప్రెస్ కాన్ఫరెన్స్ లో సప్కాల్ మాట్లాడుతూ.. ‘ ఔరంగజేబు ఒక క్రూరమైన పాలకుడిగా మనకు తెలుసు. ప్రస్తుత మన రాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్ కు కూడా ఔరంగజేబు లక్షణాలే ఉన్నాయి. ఎప్పుడూ మతపరమైన అంశాలకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తారు తప్ప.. రాష్ట్రానికి చేసేందేమీ లేదు. రాష్ట్రంలోని హత్యకు గురైన సర్పంచ్ సంతోష్ దేశ్ ముఖ్ తరహా అంశాలకే ఆయన ప్రాధాన్యం ఉంటుంది. మరి ఆయన్ను ఔరంగజేబు పాలనతో పోల్చడంతో తప్పేంటి’ అని ఆరోపించారు.

**పిల్ల చేష్టలు వద్దు.. : బీజేపీ స్ట్రాంగ్ రియాక్షన్**

పబ్లిక్ లో ఏది పడితే అది మాట్లాడాతానంటే ఇక్కడ కుదరంటూ కాంగ్రెస్ ప్రెసిడెంట్ సప్కాల్ ను హెచ్చరించింది బీజేపీ. దీనిపై బీజేపీ నాయకుడు ప్రవీణ్ దరేకర్ మాట్లాడుతూ.. ‘ చీఫ్ మినిస్టర్ రాష్ట్రంలో అత్యద్భుతంగా పరిపాలన సాగిస్తున్నారు. అటువంటి నాయకుడ్ని ఔరంగజేబుతో పోలుస్తారా?, ఇది కచ్చితంగా ఖండించాల్సిన అంశమే. ఇది మహారాష్ట్రకే అవమానం. సప్కాల్ పై కేసు ఫైల్ చేయాల్సిందే. ఆయనపై కఠిన చర్యలు తీసుకుంటే వేరే వాళ్లు ఈ తరహా వ్యాఖ్యలు చేయరు. సప్కాల్ పై చర్యలు ఒక ఉదాహరణ కావాలి’ అని ప్రవీణ్ దరేకర్ డిమాండ్ చేశారు.

## నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రజలను దోచుకుంటోంది



కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై మరోసారి విరుచుకుపడ్డారు. ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టినప్పటికీ దాని ప్రయోజనాలను ప్రజలకు చేరవేయడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రస్తుతం ముడి చమురు ధరలు 42 నెలల కనిష్ఠ స్థాయికి చేరుకున్నాయని అన్నారు. ఈ మేరకు పలు మీడియా సంస్థలు వెల్లడించిన నివేదికలను ఆయన ఉటంకించారు. బీజేపీ ప్రభుత్వం ఇంకెన్నాళ్లు ప్రజల నుంచి వసూళ్లకు పాల్పడుతూ వారిని దోచుకుంటుందని మల్లికార్జున్ ఖర్గే ప్రశ్నించారు. ముడి చమురు ధరలు నిరంతరం తగ్గుతూనే ఉన్నాయని, పెట్రోల్, డీజిల్ ధరలు మాత్రం తగ్గట్లేదని విమర్శించారు. మే 2014 నుంచి సుమారు 34 శాతం వరకు ముడి చమురు ధరలు తగ్గాయని చెప్పారు. పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం రూ.36 లక్షల కోట్ల పన్ను వసూలు చేసిందని ఆరోపించారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం కారణంగా ప్రజలు కన్నీరు పెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇంకా ఈ దోపిడీ ఎంతకాలం కొనసాగుతుందని ఖర్గే సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం త్వరలో అమల్లోకి తేనున్న లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై మాట్లాడుతూ.. కేంద్రం దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేస్తోందని అన్నారు. దేశ వనరులు, పాలనలో అన్ని రాష్ట్రాలకు సమన్యాయం ఉండాలన్నారు. జనాభా ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేయడంవల్ల దక్షిణాదిలో ఎంపీ సీట్ల సంఖ్య తగ్గే అవకాశం ఉందని, ఉత్తరాదిలో ఆ సంఖ్య పెరిగే అవకాశం ఉందని అన్నారు. దాంతో దేశంలో సమన్యాయం లేకుండా పోతుందని వ్యాఖ్యానించారు. అలాంటివి జరగకుండా సామాజిక సమానత్వం కోసం అందరు కలిసికట్టుగా పోరాడాలని మల్లికార్జున్ ఖర్గే పిలుపునిచ్చారు.

## కులం గురించి మాట్లాడితే సహించేది లేదు

కేంద్ర మంత్రి, బీజేపీ సీనియర్ నేత నితిన్ గడ్కరీ కుల వివక్షపై కీలక వ్యాఖ్యలు చేశారు. నాగపూర్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎవరైనా కుల వివక్ష గురించి మాట్లాడితే సహించేది లేదన్నారు. కుల మతాలు, భాష తదితరాల ఆధారంగా సమాజంలో ఎవరిపైనా వివక్ష చూపరాదని అన్నారు. ఎవరైనా కులం, మతం, భాష ఆధారంగా గొప్పవారు కాలేరని, వారికి ఉన్న గుణాలతోనే గొప్ప వారు అవుతారని నితిన్ గడ్కరీ అభిప్రాయపడ్డారు. ఒక వ్యక్తి కులమతాలు, భాష, లింగ వివక్షకు అతీతంగా ఎదిగినప్పుడే గొప్ప వారు కాగలరని మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చెప్పిన మాటలు అందరికీ స్ఫూర్తిదాయకమని గడ్కరీ పేర్కొన్నారు.

## రాజ్‌నాథ్ సింగ్‌తో అమెరికా ఇంటెల్ చీఫ్ తులసీ గబ్బర్డ్ భేటీ



**న్యూఢిల్లీ:** కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో అమెరికా నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తులసి గబ్బర్డ్ సోమవారంనాడు సమావేశమయ్యిరు. ఈ సమావేశంలో ఇరుదేశాల మధ్య రక్షణ, భద్రతా సహకారం బలోపేతంపై చర్చించారు. ఒక రక్షణ ఒప్పందపైన కూడా చర్చలు జరిగినట్టు తెలుస్తోంది. తులసి గబ్బర్డ్‌తో సమావేశమైన విషయాన్ని సామాజిక మాధ్యం ‘ఎక్స్’లో రాజ్‌నాథ్ సింగ్ షేర్ చేశారు. రక్షణ, సమాచార షేరింగ్‌తో పాటు, ఇండియా-యూఎస్ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు సమావేశంలో ఉభయులూ చర్చించినట్టు చెప్పారు. ట్రంప్ రెండో విడత కార్యవర్గంలోని సీనియర్ స్థాయి అధికారి భారత్ పర్యటించడం ఇది మొదటిసారి. రెండున్నర రోజుల పర్యటనలో భాగంగా ఆదివారంనాడు న్యూఢిల్లీకి వచ్చిన ఆమె గ్లోబల్ ఇంటెలిజెన్స్ కాంక్లేవ్‌లూ కూడా పాల్గొన్నారు. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోబల్‌తోనూ ఆదివారం సాయంత్రం గబ్బర్డ్ సమావేశమయ్యారు. భారత్, అమెరికా మధ్య భద్రతారంగంలో బంధాన్ని బలోపేతం చోసుకోవడంతో ఉభయులూ చర్చించారు. ఇండో-పసిఫిక్, ఖలిస్థానీ ఉగ్రవాదం వంటి అంశాలు కూడా చర్చించినట్టు సమాచారం.

# ప్రభుత్వంపై అందరికీ నమ్మకం కలిగించడమే తమ లక్ష్యం

-మొదటిపేజీ తరువాయి

రూ.6 వేల కోట్లతో ఈ పథకం చేపట్టినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా 5 లక్షల మంది నిరుద్యోగులకు లబ్ధి చేకూరుతోందన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగ యువతకు సాయంగా ఉంటుందని చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో 10 నెలల్లోనే 57,924 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని వివరించారు. అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే ఇన్నీ ఉద్యోగాలు ఇచ్చిన రాష్ట్రం దేశంలోనే లేదని పేర్కొన్నారు. గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆడబిడ్డల ఆత్మగౌరవం నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నామన్నారు. అలాగే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. మహిళలకు త్వరలోనే 1.20 కోట్ల చీరలు పంపిణీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు.

అసెంబ్లీ ఆవరణలో రాజీవ్ యువ వికాసం పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదిలోనే 54 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని తెలిపారు. మొదటి ఏడాదిలో ఇంత భారీ సంఖ్యలో ఉద్యోగాలు ఇచ్చిన రాష్ట్రం మరొకటి లేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న వివిధ పథకాలతో లక్షలాది కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని అన్నారు. స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న 65 లక్షల మంది మహిళలకు త్వరలో నాణ్యమైన చీరలను పంపిణీ చేస్తామని అన్నారు.

స్వాతంత్ర్యం తర్వాత ఇప్పటి వరకు కులగణన జరగలేదని తెలిపారు. సమాజానికి ఎక్స్ రే వంటి కులగణన దేశమంతా జరగాలని రాహుల్ గాంధీ చెప్పారని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం మూడున్నర దశాబ్దాలుగా ఉద్యమం



జరుగుతోందని తెలిపారు. తాము అబద్ధాల పునాదుల మీద ప్రభుత్వాన్ని నడపడం లేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వం భారీగా అవినీతి, దుబారాకు పాల్పడిందని అన్నారు.

ఇక, ఒక్క ఇసుక విక్రయంలోనే రోజువారీ ఆదాయం రూ. 3 కోట్లు పెరిగిందని తెలిపారు. రాష్ట్రంలో జీఎస్టీ వసూళ్లలో 17 శాతం పెరుగుదల నమోదైనట్లు చెప్పారు.

రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. స్వయం సహాయక సంఘాల మహిళలకే.. పాఠశాలల నిర్వహణ బాధ్యత అప్పగిస్తున్నామన్నారు. రాష్ట్రంలో 29,550 పాఠశాలలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం.. ఆర్టీసీకి రూ.5,500 కోట్లు చెల్లించామని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. అదే విధంగా రైతులకు రూ.20,617 కోట్ల రుణమాఫీ చేశామని.. బీసీలకు 42% రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో బిల్లు సైతం పెట్టామని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఇప్పటికే ఎస్సీ వర్గీకరణపైనా అసెంబ్లీలో బిల్లు పెట్టామన్నారు. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం భారీగా అవినీతి, దుబారా చేసిందన్నారు.

కానీ తాము దుబారా ఖర్చులు తగ్గిస్తూ.. అప్పులు చెల్లిస్తున్నామని చెప్పారు. నిత్యవసర ధరల నియంత్రణలో దేశంలోనే ముందున్నామని చెప్పారు. జీఎస్టీ వసూళ్లలో దేశంలోనే తెలంగాణ ముందుందని గుర్తు చేశారు. ఇక ఇసుక విక్రయంలోనే రోజు వారీ ఆదాయం రూ. 3 కోట్లు పెరిగిందన్నారు. అబద్దాల పునాదులపై తాము ప్రభుత్వాన్ని నడపట్లేదన్నారు. దేశంలోనే ఇప్పటి వరకు ఎక్కడా కులగణన జరగలేదని గుర్తు చేశారు. దేశమంతా కుల గణన జరగాల్సిన అవసరం ఉందని.. దాని ఆవశ్యకతను సీఎం రేవంత్ రెడ్డి నొక్కి చెప్పారు.

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఒకప్పుడు నోటిఫికేషన్ల కోసం రాష్ట్రంలో ధర్నాలు జరిగేవన్నారు. గత పదేళ్లలో ఒక్క గ్రూప్-1 పరీక్ష సైతం నిర్వహించలేదని గుర్తు చేశారు. ఇక రూ.6 వేల కోట్లతో ఇలాంటి పథకాన్ని ఎవరూ ప్రారంభించలేదన్నారు. ఒక్కో నియోజకవర్గంలో 5 వేల మందికి ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతోందని తెలిపారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళనతో ఫలితాలు పారదర్శకంగా ఉన్నాయన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగ యువత కోసం రాజీవ్ యువ వికాసం పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం తెర మీదకు తీసుకు వచ్చింది. దాదాపు 5 లక్షల మందికి రూ.6 వేల కోట్ల వరకు రాయితీతో రుణాలు అందిస్తుంది. ఒక్కో లబ్దిదారుడికి రూ. 4 లక్షల వరకు మంజూరు చేస్తారు. 60 నుంచి 80 శాతం వరకు రాయితీతో రుణాలు అందజేయనుంది. ఈ పథకంలో దరఖాస్తులు స్వీకరణకు తుది గడువు ఏప్రిల్ 5వ తేదీ. ఏప్రిల్ 6 నుంచి మే 31 వ తేదీ వరకు దరఖాస్తులను పరిశీలిస్తారు. జూన్ 2 వ తేదీన రాయితీ రుణాలను ప్రభుత్వం మంజూరు చేయనుంది.

# అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ బిల్లు


**హైదరాబాద్, మార్చి 17:** రిజర్వేషన్ల సాధనకు తాను నాయకత్వం వహిస్తానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కలిసి కట్టుగా అందరం ప్రధాని మోదీ వద్దకు వెళ్దామని ఆయన అన్ని పార్టీలకు పిలుపు నిచ్చారు. ఆ క్రమంలో ప్రధాని మోదీ అపాయింట్‌మెంట్ ఇప్పించాలని కేంద్ర మంత్రులు జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఆ క్రమంలో తాము రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ సైతం తీసుకుంటామన్నారు. ఈ బిల్లు కోసం లోక్ సభలో పోరాటం చేయాలని ఆయనను కోరతానని తెలిపారు. ఇక బీఆర్ఎస్ అధ్యక్షుడు, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ సైతం కలిసి రావాలని కోరుతున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. వివాదాలకు తావు లేకుండా బలహీన వర్గాలకు న్యాయం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. మంగళవారం అసెంబ్లీలో ఆమోదానికి బీసీ రిజర్వేషన్ బిల్లు వచ్చింది. ఈ బిల్లు ఆమోదం కోసం చర్చ జరిగింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 42 శాతానికి బీసీ రిజర్వేషన్లు పెంచాలని నిర్ణయించి.. ఈ బిల్లు పెట్టామని పేర్కొన్నారు. అలాగే రాజకీయంగానూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామన్నారు. బీసీలకు రిజర్వేషన్లపై పార్టీలకతీతంగా ఐక్యంగా ఉన్నారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 1979లోనే ఈ రిజర్వేషన్ల కోసం మండల్ కమిషన్ వేశారని గుర్తు చేశారు. మండల్ కమిషన్‌తోనే బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత అని ఆయన గుర్తు చేశారు. కులగణన, బీసీ రిజర్వేషన్ల ప్రక్రియ ఏడాది లోపు పూర్తి చేస్తామని చెప్పారు. రిజర్వేషన్లపై కేంద్రం అంగీకారం కోసం పోరాడతామని వెల్లడించారు. తెలంగాణలో 56.36 శాతం బలహీనవర్గాలు ఉన్నాయని వివరించారు. బలహీనవర్గాలకు అండగా నిలబడాలనే.. కామారెడ్డి సభలో డిక్లరేషన్ పెట్టామని సీఎం రేవంత్ పేర్కొన్నారు. లోక్‌సభలో



ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ చెప్పినట్లే.. తెలంగాణలో కులగణన చేశామన్నారు. గతేడాది ఫిబ్రవరి 4న కేబినెట్‌లో తీర్మానం చేశామని చెప్పారు. తొలి దఫా సర్వేలో పాల్గొనని వారికి మరో అవకాశమిచ్చామన్నారు. 3.55 కోట్ల మందికిపైగా సంపూర్ణ వివరాలు అందించారన్నారు. ఈ సర్వేలో 75 వేలమంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. తెలంగాణలో తమ పార్టీ అధికారంలోకి వస్తే.. కుల గణన సర్వే నిర్వహిస్తామని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రకటించారు. ఇక 2023 ఏడాది చివర్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటరు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాడు. దీంతో రేవంత్ రెడ్డి సారథ్యంలో పార్టీ కొలువు తీరింది. ఈ నేపథ్యంలో 2025 ఏడాది ప్రారంభంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కులగణన చేపట్టింది. అయితే ఈ సర్వేలో బీసీల శాతం తగ్గిందంటూ ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పార్టీ ఆరోపించింది. అంతేకాకుండా ఈ సర్వే అంతా తప్పుల తడకగా అభివర్ణించింది. ఇక ఈ విమర్శలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం బలంగా తొసిపుచ్చింది. అలాగే కులగణనలో పాల్గొనని వారి కోసం మరో అవకాశాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వం కల్పించిన సంగతి తెలిసిందే.

# అధ్వాన్నంగా మారుతున్న ఓఆర్ఆర్ నిర్వహణ

**హైదరాబాద్ :** ఔటర్ రింగ్ రోడ్డు.. హైదరాబాద్ నగరానికి మణిహారం. నగరంలో ట్రాఫిక్ తగ్గించి, సాఫీగా వెళ్లేందుకు దీన్ని నిర్మించారు. గతంలో హెచ్ఎండీఏ పర్యవేక్షణలో ఉన్నప్పుడు బాగుండేది. కానీ ప్రస్తుతం పరిస్థితి మారిపోయింది. ఫలితంగా నిత్యం వేలాదిమంది వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రయాణం.. రోజురోజుకూ ప్రమాదకరంగా మారుతోంది. స్పీడ్ కంట్రోల్, ఇతర సమాచారం తెలిపే డిజిటల్ సైన్ బోర్డులు పని చేయడం లేదు. ఫలితంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏ లైన్లలో ఏ వాహనాలు వెళ్లాలో తెలియక.. ప్రమాదాలకు గురవుతున్నారు. అయినా సంబంధింత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. హైదరాబాద్ మహానగరం చుట్టూ.. 158 కిలో మీటర్ల మేర ఔటర్ రింగ్ రోడ్డు ఉంది. దీని పర్యవేక్షణ బాధ్యత గతంలో హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో ఉండేది. ఆ తర్వాత ప్రైవేటు సంస్థకు 30 ఏళ్లపాటు బీఆర్ఎస్ ప్రభుత్వం లీజుకిచ్చింది. దీనిపై ప్రస్తుతం నిత్యం ఒకటిన్నర లక్షల వాహనాలు ప్రయాణిస్తున్నాయి. నెలకు దాదాపు రూ.70 కోట్ల వరకు టోల్ వసూలవుతోంది.



అయినా నిర్వహణ సక్రమంగా లేదనే విమర్శలు ఉన్నాయి. 8 వరుసలతో ఈ రోడ్డు ఉండగా.. మధ్య నుంచి తొలి 2 వరుసల్లో 120 కిలోమీటర్ల వేగంతో వాహనాలు వెళ్లాలి. తర్వాత రెండు లైన్లలో 80 కిలోమీటర్ల వరకే వేగ పరిమితి ఉంది. ఈ సమాచారాన్ని వాహనదారులకు తెలిసేలా గతంలో రోడ్డు మధ్యలో సైన్ బోర్డులు ఏర్పాటు చేశారు. అలాగే.. వచ్చే ఇంటర్‌ఛేంజ్ పేరు, ఎక్కడ దిగితే ఎటువైపు వెళ్లొచ్చు వంటి సమాచారం ఇందులో పొందుపర్చారు. రాత్రి సమయంలో కనిపించేలా ఫ్లడ్‌లైట్లు అందుబాటులోకి తెచ్చారు. స్పీడ్ కంట్రోల్ కోసం పోలీసుల ఆధ్వర్యంలో పహారా ఉంది. కానీ.. చాలా ప్రాంతాల్లో సైన్ బోర్డులు పనిచేయడం లేదు. భారీ వాహనాలు తొలి రెండు లైన్లలోకి వచ్చేస్తున్నాయి. ఫలితంగా తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. స్పీడ్ గన్ల వ్యవస్థ నామ మాత్రంగానే ఉంది. ఎక్కడపడితే అక్కడ రోడ్డుపక్కన భారీ వాహనాలు నిలిపేస్తున్నారు. ఈ కారణంగా వెనుక నుంచి వేగంగా వస్తున్న వాహనాలు.. దగ్గరకు వచ్చే వరకు అవి కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. లైన్లతో ఈ రింగ్ రోడ్డు నిర్మించినా.. వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. అప్పుడప్పుడు ఫాస్టాగ్ పనిచేయక టోల్‌బూత్‌ల వద్ద వాహనాలు నిలిచిపోతున్నాయి. 3 సెకన్లలోపే స్కానింగ్ ప్రక్రియ పూర్తి కావడం లేదు. దీంతో వెనక వచ్చే వాహనాలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా దీని నిర్వహణపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని వాహనదారులు కోరుతున్నారు. హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో ఉన్నప్పుడే నిర్వహణ బాగుండేదని చెబుతున్నారు.

## కీళ్ల నొప్పుల చికిత్సలోమరో అధ్యాయం

-మొదటిపేజీ తరువాయి

అవసరం లేకుండానే నొప్పులను తగ్గించే విధంగా దీనిని రూపొందించారు.

అన్ని వయస్సుల వారికీ ఉపయోగం...

అపోలో హాస్పిటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీత రెడ్డి మాట్లాడుతూ... "జాయింట్ ప్రిజర్వేషన్ ప్రోగ్రామ్ రోగికి సౌకర్యవంతంగా ఉండే చికిత్స. కీళ్ల నొప్పులతో బాధపడుతున్న అన్ని వయస్కుల వారికి ప్రయోజనం చేకూర్చేలా దీన్ని రూపొందించారు. ఇందులో భాగంగా టైలర్డ్ అడ్వైజ్, ట్రీట్మెంట్, థెరఫీస్, రీహాబిలిటేషన్ , పోషకాహారం, అవసరమైన ప్రత్యామ్నయ చికిత్సలు- '3 పై దృష్టి పెడుతుంది. బాధితులు కీళ్ల సమస్యల నుంచి బయటపడటంతోపాటు సుదీర్ఘకాలంపాటు ఆరోగ్యవంతమైన జీవనశైలితో గడిపేందుకు ఇది ఉపయోగపడనుంది. కీళ్ల పనితీరు మెరుగుపరిచి బాధితులను శక్తివంతులను చేయాలనే కృతనిశ్చయంతో మేం పని చేస్తున్నాం" అని అన్నారు. "కీళ్ల నొప్పుల నుంచి కాపాడటానికి ఈ నూతన కార్యక్రమం ఆర్థ్రోస్కోపిక్ పద్ధతులను చికిత్సలతో అనుసంధానిస్తుంది. కీళ్ల పనితీరును మెరుగుపరచడం,పూర్తి కీలు మార్పిడి అవసరం లేకుండా సమస్య నివారించడంపై మేము దృష్టి సారించాం" అని అపోలో హాస్పిటల్స్ చీఫ్ జాయింట్ రీప్లేస్‌మెంట్ ఆర్థ్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ కె జె రెడ్డి అన్నారు. ఆర్థ్రోస్కోపీ స్పోర్ట్స్ మెడిసిన్ కన్సల్టెంట్ డాక్టర్ రవితేజ రుద్రరాజు మాట్లాడుతూ.. "ఈ కార్యక్రమం అత్యాధునికరీజెనరేటివ్ చికిత్సలను సమగ్రమైన రీహాబిలిటేషన్, పోషకాహార పద్దతులతో మిళితం చేసి సమగ్ర చికిత్స మార్గాన్ని అందిస్తుంది.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం...

**గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాఘవ రెడ్డి.**



**శివంపేట,మార్చి17 (సూర్యరేఖ)**మెదక్ జిల్లా శివంపేట మండలంలోని పిల్లుట్ల గ్రామానికి చెందిన పిల్లి గోనయ్య మృతిచెందా రు..విషయం తెలుసుకున్న పిల్లుట్ల గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాఘవరెడ్డి వారి పార్థిహదేహానికి నివాళులర్పించారు.వారికి ప్రగాఢ సంతాపం తెలియజేసి వారి కుటుంబానికి తన వంతుగా రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది.ఇలాంటి మంచి మనిషి గ్రామాన్ని విడిచిపోవడం ఎంతో తీరనిలోటు వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని కోరుతున్నట్లు రాఘవ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో యువ నాయకులు బుర్ర మురళి గౌడ్,పిల్లి మధు,గుర్రాల బాలేష్,పెద్దపల్లి సతీష్,గొల్ల స్వామి,పిల్లి నరేష్,బాసంపల్లి నరసింహులు, గులయ్యగారి రాములు,పిల్లి ఏసాములు,పిల్లి రామాంజనేయులు,పిల్లి సత్తయ్య , గాండ్ల ఆంజనేయులు ,పిల్లి సుధాకర్,తలారి హనుమంతు,గుల్లయ్యగారి రవి,పిల్లి సురేష్,బుర్ర వినయ్,ముస్కురి కన్నయ్య,సంద్ర విష్ణు,భవీన్ రెడ్డి, గ్రామ పెద్దలు ఉన్నారు.

## మైభారత్ నెహ్రు యువక కేంద్ర మెదక్ జిల్లా స్థాయి క్రీడా పోటీలు..


**కేంద్ర క్రీడల శాఖ యువజన సర్వీసులు ఉపాధి ఆఫర్స్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు..**
**రామాయంపేట యువజ్యోతి స్పోర్ట్స్ అండ్ యూత్ నిర్వహణ..**
**వాలీబాల్,ఫుట్బాల్,కబడ్డీ,బ్యాడ్మింటన్,సెటిల్ క్రీడల్లో పోటీలు..**
**కాలేజీ గ్రౌండ్లో ఈ నెల 19 నుండి 20 వరకు..**




**రామాయంపేట,మార్చి17 (సూర్యరేఖ)** యువతను చైతన్య పరచడానికి క్రీడలు యువజన సర్వీసుల శాఖ స్వయం ఉపాధి అవేర్నెస్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దేశంలోని యువతకు ఆటల ద్వారా స్ఫూర్తి కలిగించే కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందని సిద్దిపేట నెహ్రూ యువ కేంద్ర అధికారి కిరణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రామాయంపేట పట్టణంలో గత 40 సంవత్సరాలుగా క్రీడలకు ప్రోత్సహిస్తూ అనేక శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్న యువజ్యోతి స్పోర్ట్స్ అండ్ యూత్ క్లబ్ కు మెదక్ జిల్లాస్థాయి స్పోర్ట్స్ మీట్ కార్యక్రమాన్ని నెహ్రూ కేంద్ర ఆధ్వర్యంలో స్థానిక యువజ్యోతి నిర్వహిస్తుందని తెలిపారు.మెదక్ జిల్లా స్థాయి ఈ పోటీలలో వాలీబాల్,కబడ్డీ,ఫుట్బాల్ బ్యాట్మెంటన్,సెటిల్ పోటీలను 13 సంవత్సరాల నుండి 19 సంవత్సరాల వరకు యువకులకు బాలురకు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.ఉచితంగా క్రీడాలు నిర్వహిస్తూ భోజన సదుపాయం కల్పించడం జరుగుతుందన్నారు.క్రీడల్లో పాల్గొన్న వారికి కేంద్ర మంత్రిత్వ శాఖ క్రీడాకారులకు సర్టిఫికెట్ అందజేస్తామన్నారు.క్రీడల్లో పాల్గొన్న వారికి అలాగే విజేతలకు మెరిట్ సర్టిఫికెట్,మెమోటోస్ అందజేయడం జరుగుతుందన్నారు.ఈ క్రీడల్లో పాల్గొనడానికి స్థానిక రామాయంపేట యువజ్యోతి కో-ఆర్డినేటర్ సత్యనారాయణకు పేర్లు అందజేయాలని కోరారు.9000752850 ఫోన్ నెంబర్ కు తెలియజేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.ఈనెల సోమవారం 18 వ తేది నమోదు చేసుకోవాలని,19,20 తేదీల్లో క్రీడలు నిర్వహిస్తామని ఆయన తెలియజేశారు యువకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# శత వసంతాల మాలపల్లి నవల






గాంధేయ వాదిగా, న్యాయ వాదిగా, సంఘ సంస్కర్తగా, స్వాతంత్ర్య యోధుడుగా, ఉద్యమ నాయకునిగా, స్త్రీ విద్య ప్రోత్సాహికునిగా, కాంగ్రెస్ నేతగా, దళిత జనోద్ధారకునిగా, ప్రధానంగా తెలుగు నవలా సాహిత్య వైతాళికుడుగా ఉన్నవ లక్ష్మీ నారాయణ తెలుగు వారికి సుపరిచితుడే. ముఖ్యంగా నాటి సాంఘిక దురాచారాలను ప్రతిబింబించే, మాలపల్లి నవల నాడు ఒక సంచలనమే. సాంఘిక, ఆర్థిక అసమానతలను తొలగించి, కుల వ్యవస్థను నిరసించి, అందరూ సమానులే అన్న భావనతో, అగ్రవర్ణాలు, హరిజనులు అందరూ కలసి మెలసి ఉండాలని కోరుకుంటూ, "మాలపల్లి" అనే విప్లవాత్మకమైన నవలను రవించడం, తన దృక్పథానికి మద్దతుగా, "సహ పంక్తి భోజనాలు" నిర్వహించడం ఆ రోజులలో సాహసమే. మాలపల్లి తెలుగు సాహితీ చరిత్రలోనూ, సామాజిక దృక్పథంలోనూ ఒక నూతన ఒరవడిని సృష్టికి, చర్చోప చర్చలకు కారణభూతమైంది. ఒక దళిత కుటుంబం సమా జంలో కలిసి మెలసి ఉండడానికి చేసే ప్రయత్నం, సదరు ప్రయత్నంలో ఎదురైన చేదు అనుభవాలు, ఆ అనుభవాలతో రాటుదేలిన వ్యక్తులు చైతన్యమై సంఘటి తమై సమాజంలో నిర్లక్షం చేయబడ్డ తమ ఉనికి కోసం, మెరుగైన స్థానం కోసం చేసే పోరాటాలు వంటి అంశాలతో మాలపల్లి నవలలోని పాత్రలు ఉదాత్తంగా చిత్రీకరించ బడ్డాయి. సామాజిక మార్పు కోసం బలహీన దళిత, పీడిత వర్గాలు చైతన్యంతో సుసంఘ టితం కావాలని, పోరాటా లకు సిద్ధపడాలని మాలపల్లి ప్రబోధించింది. 1922లో పల్నాడు పుల్లరి సత్యాగ్రహంలో పాల్గొని అరెస్టయి రాయ వెల్లురు జైలుకు ఉన్నవ లక్ష్మీనారాయణ తరలించ బడిన సమయం లోనే అక్కడే తన లక్ష్య సాధనకై విప్లవాత్మకమైన తెలుగు నవలా సాహిత్యంలో చిరస్మరణీయమైన 'మాలపల్లి' నవలను ఆయన రచించారు. మాలపల్లి నవల దళిత కుటుంబాన్ని ప్రధాన కథాశంగా రచించిన తొలి రాజకీయ నవల. 1922 లో మాలపల్లి నవలను బెల్లంకొండ రాఘవరావు ముద్రించగా, మద్రాసు ప్రభుత్వం మాలపల్లి నవలపై నిషేధం విధించింది. రాజకీయ వాతావర ణాన్ని, గాంధీ మహాత్ముని ఆశయాల్ని, తెలుగువారి జీవన విధానాన్ని ప్రతిబింబించిన నవల మాల పల్లి. ఆ నవలలో సాంఘిక దురాచారాలు, జాతీయ సత్యాగ్రహ ఉద్యమాలు, వర్ణ , వర్గ వ్యత్యాసాలు తదితర ఆ నాటి పరిస్థితులను కల గలిపి, కళ్ళకు కట్టినట్లు ఉన్నవ చిత్రించడం విశేషం. ఆనాడు హరిజనుల కుటుంబ గాథను ఇతివృత్తంగా ఎన్నుకొని నవల వ్రాయడమే సాహసం. 1926 లో మద్రాసు శాసన మండలిలో మాలపల్లి నిషేధంపై చర్చలు జరగడం, 1928 లో కొన్ని మార్పులతో మాలపల్లి ప్రచురణకు తిరిగి అనుమతి లభించడం, మద్రాసు ప్రభుత్వం ఆంధ్ర విశ్వ విద్యాలయం మాలపల్లిని ప్రచురించి, ఆ నవలను పాఠ్య గ్రంథంగా ఎంపిక చేయడం, 1936 లో మద్రాసు ప్రభుత్వం మాలపల్లి నవలపై రెండోసారి నిషేధం తెలిపి ఆ నవలను పాఠ్య గ్రంథంగా తొలగించడం, 1937లో చక్రవర్తుల రాజగోపాలాచారి మద్రాసు ప్రధానిగా ఎన్నికైనప్పుడు తొలి కాంగ్రెసు మంత్రి వర్గంచే మాలపల్లి నవలపై నిషేధపు ఉత్తర్వులను రద్దు చేయించడం క్రమానుగతంగా జరిగి పోయాయి. సామాన్య ప్రజల సంక్షేమం, అభ్యుదయాన్ని కోరే కవిత్వం ప్రజలకు సులభంగా అర్థమయ్యే వాడుక భాషలో ఉండాలన్న లక్ష్యంతో మాలపల్లి నవలలో చరమ గీతం, సమతా ధర్మం అనే రెండు గేయ కవితల్ని సామాన్య ప్రజలకు అర్థమయ్యే నిత్య వాడుక భాషలో జానపద గేయ రీతుల్లో రచించాడు. ఆ నవలకు కాశీనాథుని నాగేశ్వర రావు పీఠిక వ్రాస్తూ, "ఆంధ్ర సాహిత్య హృదయ పరిణామా న్ని గ్రహించడానికి మాలపల్లి ఉత్తమ కావ్యం అని, తెనుగు మాటలు, తెనుగు దేశము, తెనుగు హృదయము, తెనుగు సంకల్పము, మాలపల్లి నవలకు అనిర్వచనీయ ప్రతిభను సమ కూర్చాయి" అని కొనియాడాడు. అందుకే తెలుగు సాహిత్యంలో వచ్చిన తొలి విప్లవ నవలగా గుర్తింపు పొందింది.ఆయన సాహిత్యం ద్వారా హరి జనోద్ధరణకు కృషి చేశాడు. గుంటూరులో శ్రీ శారదా నికేతన్ ను స్థాపించి, స్త్రీ విద్యను ప్రోత్సహించాడు. కందుకూరి వీరేశలింగం పంతులు అధ్యక్షతలో తొలి వితంతు వివాహం జరిపించిన సంస్కర్తగా నిలిచాడు. రష్యాలో 1917లో జరిగిన బోల్షవిక్ విప్లవం వల్ల స్ఫూర్తి పొందిన మొదటి తెలుగు కవి ఉన్నవ. కూలీల పక్షం వహించి కవులు రచనలు చేయడానికి ప్రేరణ నిచ్చింది సదరు రష్యా విప్లవ ప్రభావమే. ఉన్నవ... మాల పల్లి, నాయకురాలు, బుడ బుక్కల జోస్యం, స్వరాజ్య సోది, భావ తరంగాలు తదితర రచనలు చేశాడు. గాంధేయ వాదిగా, సంఘ సంస్కర్తగా, స్వాతంత్ర్య యోధు నిగా తెలుగు నవలా సాహిత్య వైతాళికుడుగా కీర్తి పొందిన ఉన్నవ లక్ష్మీనారాయణ గుంటూరు జిల్లా అప్పటి సత్తెనపల్లి తాలూకా వేములూ రు పాడు గ్రామంలో 1877 డిసెంబరు 4న జన్మించి, 1958 సెప్టెంబరు 25 న మరణించాడు.

# ఆధ్యాత్మికతతో తరిస్తున్న ప్రభుత్వాలు



రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కూటమి లక్ష్యమైన 'హిందూ రాజ్య స్థాపన' ఎజెండా బహూముఖ పద్ధతుల్లో ప్రాచుర్యం పొందిన కథనాలపై నిర్మించబడుతుంది. దాని ఎజెండాను ముందుకు తీసుకెళ్లే అంశాల్లో పండుగలు ఒకటి. 'సామాజిక రాజకీయ సందేశం' లో భాగంగా కొద్దిమంది దేవతల్ని ముందుకు తీసుకొని రావడం కూడా రాజకీయ రంగంలో ప్రధానమైన మార్గంగా ఉంది. ఇటీవలి కాలంలో జరిగిన కుంభమేళా ఓ పెద్ద దృశ్యం. మతపరమైన సమ్మేళనం కంటే కూడా ఇది ఒక జాతీయ కార్యక్రమంగా మారింది. ఈ సంవత్సరం జరిగిన కుంభమేళాలో ఒక ప్రధానమైన మార్పు ఏమంటే, దాని భారీ మార్కెటింగ్ ఒక సాంస్కృతిక, అభివృద్ధి ప్రదర్శనగా మారింది. దాన్ని, హిందూ మతం కోసం ఏర్పాటు చేసిన 'భూమి పై మహా ప్రదర్శన' గా ముద్ర వేశారు. అలాంటి సందర్భాల్లో భక్తుల కోసం బస, పరిశుభ్రత, రవాణా ఏర్పాట్లు ప్రభుత్వం తప్పనిసరిగా నిర్వర్తించాల్సిన విధి. ఈ దఫా ఈ కార్యక్రమాన్ని నిర్వహించే ప్రక్రియలో ప్రభుత్వం పూర్తిగా నిమగ్నమైంది. విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్ పీ), ధర్మ సంసద్, లాంటి పాలక పార్టీ అనుబంధ సంస్థలు, వ్యక్తిగత సాధువుల లాంటి వారు కూడా హిందూ జాతీయవాద ఎజెండాలోని అంశాల్ని, 'ముస్లింల పట్ల ద్వేష భావాల్ని' ప్రచారం చెయ్యడంలో ముందు భాగంలో ఉన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి మతపరమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యతను ఒకవైపున భక్తులు ఎంతగానో అభినందిస్తుం డగా, ఈసారి కుంభ మేళాకు ఒక రాజకీయ రంగును ఇస్తుండడం ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. కుంభమేళాను నిర్వహించడం ఇదే ప్రథమం కాదు. ఈసారి ఈ సందర్భం, హిందూత్వ ఎజెండా ప్రాధాన్యతను పెంచే వేదికగా మారింది. జన సమూహాల నిర్వహణ సాధ్యం కాదని గుర్తించినప్పటికీ కూడా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆహ్వానించేందుకు ప్రకటనల కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. ఈ కార్యక్రమంలో ముస్లిం వ్యాపారస్తులు తమ దుకాణాలు ఏర్పాటు చేసే ప్రక్రియను బహిష్కరించారు. దీనికి అనేక కారణాలున్నాయి. ముస్లింలు ఆహారంలో ఉమ్మి వేశారు కాబట్టే వారిని దూరంగా ఉంచారనే విషయాన్ని స్వామీ అవిముక్తేశ్వరానంద్ ఒక అబద్ధం చెప్పాడు. అలాంటి తప్పుదారి పట్టించే చాలా వీడియోలు సామాజిక మాధ్యమంలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ సందర్భంగా తొక్కిసలాటలో బాధితులైన వారి కోసం ముస్లింలు మసీదుల్ని తెరిచి, వారి కోసం ఆహారాన్ని ఏర్పాటు చేయడం వేరే విషయం. మొగలుల పాలనా కాలంలో భక్తులకు కుంభమేళా మరింత సౌకర్యవంతంగా ఉంచడానికి అనేక ఘాట్‌లు (స్నానాల కోసం నదీ తీరాలు), మరుగుదొడ్లు నిర్మించిన విషయం గుర్తుకొస్తుంది. అక్బర్, కుంభమేళా ఏర్పాట్లను చూసేందుకు ఇద్దరు అధికారులను నియమించా డని హేరాంబ్ చతుర్వేది అనే చరిత్రకారుడు చెప్పారు. ఈ సంవత్సరం ఆ ప్రాంతమంతా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ హోర్డింగులతో నిండిపోయింది.ఈసారి వీఐపీల కోసం విశాలంగా ఎక్కువ ప్రాంతాన్ని కేటాయించడంతో తొక్కిసలాటలు జరిగాయి, దానిలో చాలా పెద్దసంఖ్యలో భక్తులు చనిపోయారు. రవాణా ఏర్పాట్లు చాలా ఘోరంగా ఉన్నాయి. న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటలో సంభవించిన మరణాల్లో ఈ రవాణా ఏర్పాట్లు ప్రతిబింబిస్తాయి. తొక్కిసలాటలో చనిపోయిన వారంతా మోక్షం (విముక్తి) పొందారని, మోడీ, తాను తమ్ముడని పిలుచుకునే ఉన్నత శ్రేణి స్వామి, ధీరేంద్ర శాస్త్రి చాలా సంతోషంగా చెప్పాడు. నీటి నాణ్యత అధిక మల మూత్రాలతో చాలా తక్కువ స్థాయిలో ఉంది. నీటి నాణ్యత, మరణాల గురించి వచ్చిన విమర్శలన్నింటికీ, "పందులు మురికిని చూస్తున్నాయి, స్వార్థపరులు చనిపోయిన వారిని లెక్కిస్తున్నారని" ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ వ్యాఖ్యానిం చాడు. వీహెచ్‌పీ, దాని మార్గదర్శక్ మండల్ సమావేశాల కోసం కుంభమేళాను ఒక సువర్ణావకాశంగా ఉపయోగిం చుకుంది. వారి ప్రసంగాలు మొత్తం ముస్లింలపై విషాన్ని చిమ్మాయి. జనాభా పెరుగుదల, బంగ్లాదేశ్ నుంచి చొరబాటు దారులు, గో రక్షణ లాంటి ముస్లింల గురించి సాధారణంగా చేసే ప్రచా రం వివిధ సమావేశాల్లో అదే పనిగా రోత పుట్టించే రీతిలో పునరావృతం అయ్యింది. సాధ్వి రితంభర, ప్రవీణ్ తొగాడియా, యతి నర్సింగ్ నానంద్ సరస్వతీ లాంటి ద్వేషాన్ని వ్యాపింపచేసే వారు ద్వేషపూరిత ప్రసంగాలతో సంబరాలు చేసుకున్నారు. ప్రేక్షకులు కూడా పెద్ద సంఖ్యలో హాజర య్యారు. పాలక భారతీయ జనతా పార్టీ దాని రాజకీయ ఎజెండా కోసం విజయవంతంగా సాధువులను ఉపయోగిం చుకొని, ప్రభుత్వ ఖర్చుతో ప్రచారాన్ని పొదింది. కాశీ, మధురల డిమాండ్‌ను పునరుద్ఘాటిస్తూ, 1860 దేవాల యాలపై 'పరిశోధనలు' జరిపామనీ, వాటిని పునరుద్ధరిం చాల్సిన అవసరం ఉందని కాషాయ వస్త్రాలు ధరించిన ఒక వ్యక్తి పేర్కొన్నాడు. హిందూ రాజ్యాన్ని స్థాపించడానికి మదర్సాలను మూసివేసి, ఇంగ్లీష్ పాఠశాలల్ని గురుకులాలుగా మార్చాలని కూడా డిమాండ్ చేశారు. 2024 లో ప్రచురితమైన ఒక పుస్తకంలో ఇర్ఫాన్ ఇంజనీర్, నేహా దభాడే, మత సంబంధమైన పండుగలను హింసను ప్రేరేపించే సందర్భాలుగా ఉపయోగించడంపై మన దృష్టిని ఆకర్షించారు. మన పండుగలు మతపరమైన హద్దులు దాటి ఆహ్లాదకరమైన సామాజిక సందర్భాలుగా ఉంటున్నాయి. ఇప్పుడేమో హిందూ పండుగల సందర్భంగా ఊరేగింపులు నిర్వహించడం, ముస్లింల నివాస ప్రాంతాల గుండా వెళ్ళడం, మసీదులపై ఉన్న ఆకుపచ్చ జెండాను కాషాయ జెండాగా మార్చడం, చేతుల్లో కత్తులు పట్టుకొని నృత్యం చెయ్యడం ఒక ధోరణిగా మారింది. అదే సమయంలో ముస్లింలకు వ్యతిరేకంగా దిక్కులు పిక్కటిల్లేలా ద్వేషపూరిత నినాదాలు ఇస్తున్నారు. ఇదే పుస్తకంలో, 2022-2023లో శ్రీరామనవమి సందర్భంగా హౌరా, హుగ్లీ (పశ్చిమబెంగాల్-2023)లో, సంబాజీ నగర్ (మహారాష్ట్ర -2023)లో, వడోదరా (గుజరాత్ -2023)లో, బీహార్ షరీఫ్, ససారాం (బీహార్ -2023)లో, ఖర్గోన్ (మధ్యప్రదేశ్ -2022)లో, హిమ్మత్ నగర్, ఖంబాత్ (గుజరాత్ -2022) లో, లోహర్దగా (జార?ండ్-2022)లో హింసాత్మక సంఘటనలు జరిగాయనే విషయాన్ని ఇద్దరు రచయితలు లేవనెత్తారు. "మతపరమైన ప్రదర్శన"గా నమ్మించే హిందూ జాతీయవాదుల చిన్న సమూహం కూడా మైనార్టీల నివాస ప్రాంతం గుండా వెళ్లాలని పట్టుబట్టి, రాజకీయ దూషణలతో కూడిన నినాదాలిచ్చి కొందరు యువకుల్ని రెచ్చగొట్టడం, హింసాత్మక పాటలు, సంగీతాన్ని వినిపిస్తే, దానికి ప్రతిస్పందనగా వారిపై రాయి విసిరితే, మైనారిటీల్ని పెద్ద సంఖ్యలో అరెస్ట్ చెయ్యడం, ఎలాంటి న్యాయ సంబంధ ప్రక్రియ లేకుండా కొన్ని రోజుల్లోనే వారి ఇళ్ళు, ఆస్తులను ధ్వంసం చెయ్యడం ద్వారా ప్రభుత్వం మిగిలిన పని చేస్తుందని వారు ఆశిస్తున్నారని" ఇంజనీర్ ముగించాడు. మరొక స్థాయిలో మితవాద రాజకీయాలు ఆదివాసీ ప్రాంతాల్లో శబరి, హనుమంతుని గురించి మాట్లాడుతూ, వారిని తెరపైకి తెచ్చే విధంగా ప్రోత్సహిస్తున్నారు. గడచిన మూడు దశాబ్దాల కాలంలో ఆదివాసీ ప్రాంతాల్లో క్రైస్తవ వ్యతిరేక హింస పెరగడంతో, వనవాసీ కళ్యాణ్ ఆశ్రమ్, వీహెచ్‌పీ (ఆరెస్సెస్ సంతానం)లు ఈ ప్రాంతాల్లో శబరిని తెరపైకి తెచే ప్రయత్నాలు చేశాయి. గుజరాత్‌లో డాంగ్స్ దగ్గరలో శబరి కుంభ్ నిర్వహించారు. ఈ ప్రాంతంలోనే ఒక శబరి దేవాలయాన్ని ఏర్పాటు చేశారు. ఆ సమయంలో వీహెచ్‌పీ కి చెందిన స్వామి అసీమానంద్ ఆ ప్రాంతంలోనే పని చేస్తున్నాడు. అతడే, తర్వాత కాలంలో మాలేగావ్, అజ్మర్, మక్కా మసీదుల్లో జరిగిన బాంబు పేలుళ్ల కుట్ర కేసులో పాత్రదారునిగా ఉన్నాడని మహారాష్ట్ర యాంటీ టెర్రర్ స్క్వాడ్ అతనిపై ఆరోపణలు చేసింది.ఈ ప్రాంతాల్లో శబరి, హనుమంతుడ్ని తెరపైకి తేవడానికి ఎందుకు ఎంచుకున్నారు? శబరి (రామాయణంలో)ఒక పేద మహిళ. రామునికి పెట్టేందుకు ఆమె వద్ద తగినంత ఆహారం లేదు. ఆమె బెర్రీ పండ్ల రుచిని పరీక్షించిన తర్వాతే రామునికి ఇచ్చింది. ఇక్కడ తేడా స్పష్టంగా ఉంది. పట్టణ ప్రాంతాల్లో మనకు పూజించడానికి దుర్గా, లక్ష్మీ, సరస్వతి ఉంటే, ఆదివాసీ ప్రాంతాల్లో శబరి ఉంటుంది. అదే విధంగా ఆదివాసీ ప్రాంతాల్లో హనుమం తునికి (రామ భక్తుడు) ప్రాచుర్యం ఎక్కువ. మన పండుగలపై హిందూత్వ రాజకీయాల ప్రభావం వారి రాజకీయాల్లో చాలా ప్రతిబింబిస్తుంది. వీటిలో కొన్నింటిని ఆయు ధంగా ఉపయోగిస్తున్న తీరు, లేక కుంభమేళాను ముస్లిం వ్యతిరేక వేదికగా మార్చిన తీరు, లేదా ఆదివాసీ ప్రాంతాల్లో శబరి, హనుమంతునికి బాగా ప్రాచుర్యం కల్పించిన విధానం ఆలోచించ దగిన విలువైన అంశాలు.

## సేవా భారతి ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు పంపిణీ..




**కామారెడ్డి,మార్చి 17( సూర్యరేఖ)** కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్ జెడ్పిహెచ్ ఎస్ లో 10వ తరగతి విద్యార్థులకు లింగాపూర్ సేవా భారతి ఆధ్వర్యంలో సోమవారం పరీక్ష ప్యాడ్లు పెన్నులు అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ కౌన్సిలర్ భారతీయ జనతా పార్టీ నాయకుడు కాసర్ల శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివి పరీక్షలు బాగా రాయాలని ఆయన విద్యార్థులను కోరారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కమల సేవా భారతి సభ్యులు, విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో మంజూరైన రూ.2.50 లక్షల సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన...నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు

రెడ్డిపల్లి ఆంజనేయులు గౌడ్



**కొల్చారం,మార్చి17(సూర్యరేఖ)**కొల్చారం మండలం రంగంపేట గ్రామానికి ఎన్ఆర్ ఈజీఎస్ పథకంలో మంజూరైన రూ.2.50 లక్షల సీసీ రోడ్డును నాయకులు నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి,మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రెడ్డిపల్లి ఆంజనేయులు గౌడ్, కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగులగారి మల్లేష్ గౌడ్, లు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో రంగంపేట గ్రామ శాఖ అధ్యక్షులు గోడా కృష్ణ, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ముత్యంగారి గోవర్ధన్,ఎస్సీ సెల్ నాయకులు మారెల్లి అనిల్ వెంకటగౌడ్ విజయ్ కుమార్,బాయిని లలిత, చిలక ప్రభాకర్,తదితరులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదంపై హర్షం వ్యక్తం చేసిన కైలాస్ శ్రీనివాసరావు..



**కామారెడ్డి,మార్చి17(సూర్యరేఖ)** కాంగ్రెస్ పార్టీ వస్తే బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతామని రాహుల్ గాంధీ చెప్పడం జరిగిందని,చెప్పిన విధంగా మాట నిలబెట్టుకోవడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కైలాస్ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలకు విద్య ఉద్యోగ నియమాకాలు,స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదర ముద్ర పడిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కైలా శ్రీనివాస్ రావు అన్నారు.తమ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని ఆయన అన్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలకు రిజర్వేషన్ల పెంపునకు కృషి చేశారని ఆయన తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చుతున్నందుకు సంతోషంగా ఉందని కైలా శ్రీనివాసరావు అన్నారు.

# పార్లమెంటులో మరోసారి సింగరేణి కార్మికుల కోసం గళం విప్పిన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ






**2016 నుండి రూ.20 లక్షల గ్యాడ్జెట్స్ ఇవ్వాలని పార్లమెంట్లో గలం విప్పాలి..**

**టిఎన్టియుసి ప్రధాన కార్యదర్శి టి.మణిరాం సింగ్**

**బెల్లంపల్లి,మార్చి17 (సూర్యరేఖ)** సింగరేణి రిటైర్డ్ కార్మికుల పింఛన్ పెంచాలని డిమాండ్ చేశారు. 35 ఏళ్ల క్రితం కాకా వెంకటస్వామి ప్రవేశపెట్టిన పింఛన్ స్కీమ్ కింద ప్రస్తుతం కార్మికులు కేవలం రూ.1500 మాత్రమే పొందుతున్నారని, ఇది పూర్తిగా అన్యాయమని ఆయన పేర్కొన్నారు. జీవితాంతం దేశానికి వెలుతురు అందించిన కార్మికులు, రిటైర్మెంట్ తర్వాత తగిన గౌరవంతో జీవించాలంటే,వారి పింఛన్ తక్షణమే రూ.10 వేలకు పెంచాలని కేంద్రాన్ని కోరారు. పింఛన్ పెంపుతో కార్మికులు గౌరవంగా,ఆర్థిక భద్రతతో జీవించగలరని స్పష్టం చేశారు.సింగరేణి కార్మికుల హక్కుల కోసం పోరాటం కొనసాగుతుందని,వారి త్యాగానికి సరైన గౌరవం ఇవ్వాల్సిన సమయం వచ్చిందని ఎంపీ వంశీకృష్ణ వెల్లడించారు.టిఎన్టియుసి ప్రధాన కార్యదర్శి టి.మణిరాం సింగ్ మాట్లాడుతూ... ఎంతోమంది ఈ ప్రాంతం నుండి ఎంపీగా గెలిచి పార్లమెంటులో కార్మికుల పక్షాన ఎవరు మాట్లాడలేదని,మొదటిసారిగా గడ్డం వంశీ ఎంపీ కార్మికుల పక్షాన మాట్లాడిన ఘనత వారికే కాక వెంకటస్వామి తరువాత గడ్డం మనిషికే దక్కుతుందని,వారి కుటుంబం కార్మికుల కోసం ఎన్నో త్యాగాలు చేశారని గుర్తు చేశారు.కార్మికుల పక్షాన నిలబడి 2016 నుంచి గ్రాడ్యుకేట్ రూ.20 లక్షలు ఇవ్వాలని పార్లమెంట్లో ఎంపీ వంశీ డిమాండ్ చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు.కార్మికుల పక్షాన నిలబడినందుకు ఎంపీ గడ్డం వంశీకి ఈ మని రామ్ సింగ్ ధన్యవాదాలు తెలిపారు.

# మా గ్రామానికి కొండపోచమ్మ కాలువ ద్వారా నీరునందించాలి





**పంట ఎండిపోయిన రైతులకు ప్రభుత్వం ఆదుకోవాలి..**

**రజాక్ పల్లిలో 4 ఎకరాల వరి పంట ఎండిపోయిన వైనం..**

**మూడు బోర్లు వేసి అప్పుల పాలైన రైతన్న..**

**రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని వేడుకోలు..**

**నిజాంపేట,మార్చి17(సూర్యరేఖ)** మండల పరిధిలోని రజాక్ పల్లి గ్రామానికి చెందిన రైతు కొండల్,తన వ్యవసాయ భూమిలో నాలుగు ఎకరాల వరి సాగు చేయడం జరిగింది. ఈ ఎండల తీవ్రతకు 4 ఎకరాల వరి పంట పూర్తిగా ఎండిపోవడంతో రైతు ఆందోళనకు గురయ్యారు. వరి ఎండిపోతుందనే క్రమంలో మూడు బోర్లు 300 ఫీట్లు వేసిన ఫలితం లేకపోయిందని రైతు బోరున విలపించాడు. మండలంలో కొండపోచమ్మ కాలేశ్వరం కాలువ ద్వారా బచ్చురాజుపల్లి గ్రామం వరకు కాలువ ద్వారా నీరు అందించడం జరుగుతుందని,అదే మాదిరిగా బచ్చు రాజుపల్లి నుండి కాసింపూర్, గ్రామాల మీదుగా కాలువ ద్వారా నీరు అందించినట్లయితే రైతులు వేసిన యాసంగి పంటలు ఎండిపోయే అవకాశం లేకుండా పోతుందని రైతు కుటుంబాలకు అండగా నిలిచిన వారవుతారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ చూపి గొలుసు కట్టు కాలువల ద్వారా చెరువులకు నీళ్లు అందించినట్లయితే భూగర్భ జలాలు ఎండిపోకుండా ఉంటాయని రైతుల వేసిన పంటలు ఎండిపోకుండా కాపాడుకోవచ్చన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాలువల ద్వారా చెరువులకు నీళ్లు అందిస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు,ల చొరవతో కాలువ పనులను పునరుద్ధరించి రైతుల పక్షాన నిలువాలన్నారు.అలాగే పంటలు ఎండిపోయిన రైతు కుటుంబాలకు నష్ట పరిహారం అందించేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి వారు కోరారు.

**పంట ఎండిపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలి..**

**కొండల్,రైతు రజాక్ పల్లి గ్రామ వాసి...**

యాసంగి 4 ఎకరాల వరి పంట సాగు చేయడం జరిగింది. వరి పంట పొట్టకు వచ్చే సమయానికి సరైన నీరు లేకపోవడంతో నాలుగు ఎకరాల వరి పంట ఎండిపోవడంతో వరి పంట కోసం మూడు బోర్లు వేసినప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. మండలంలో కొండపోచమ్మ కాలేశ్వరం కాలువ ద్వారా నీటిని బచ్చు రాజు పల్లి, గ్రామం వరకే నీరు అందిస్తున్నారు. మండలంలో మిగతా గ్రామాలకు కూడా కాలువల ద్వారా నీరు అందించినట్లయితే పంట పొలాలు ఎండిపోయే అవకాశం లేకుండా పోతుందని అధికారులు స్పందించి రజాక్ పల్లి గ్రామానికి గొలుసు కట్టు కాలువల ద్వారా నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

# ఘనంగా విశిష్ట మహిళా రమాబాయి అంబేద్కర్ పురస్కార వేడుకలు





**మహిళలు తమ శక్తి సామర్థ్యాలను పెంపొందించుకోవాలి..**

**స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ధరావత్ చంద్రకళ**

**మందమర్రి,మార్చి17(సూర్యరేఖ)** మహిళలు తమ శక్తి సామర్థ్యాలను పెంపొందించుకోవాలని మంచిర్యాల జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ధరావత్ చంద్రకళ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని శ్రీ మంజునాథ గార్డెన్ లో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో విశిష్ట మహిళ రామాబాయి అంబేద్కర్ పురస్కారం 2025 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంచిర్యాల జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ధరావత్ చంద్రకళ మాట్లాడుతూ. ఎన్ని అడ్డంకులు ఎదురొచ్చినా వాటిని అధిగమించి ముందుకు సాగాలని ఆమె అన్నారు.మహిళలపై ఇంకా వివక్ష కొనసాగుతుందని, మహిళలు ధైర్యంగా ఎదుర్కొన్నప్పుడు మహిళా సాధికారిక సాధ్యమవుతుందని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ గాజర్ల దేవేందర్ మాట్లాడుతూ... మహిళలు నేడు అన్ని రంగాలలో దూసుకుపోతున్నారని ఆర్థిక,సామాజిక, రాజకీయ రంగాలలో రాణించాలని అప్పుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేస్తే మరింత మందికి మహిళలకు అవకాశాలు వస్తాయని ఆయన తెలిపారు.జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిణి నీరటి రాజేశ్వరి మాట్లాడుతూ...మహిళలు ఏటెండర్ నుండి అంతరిక్షం వరకు పురుషులతో సమానంగా ఎదుగుతున్నారన్నారు.మగువలకి ప్రోత్సాహం లభిస్తే ఏ స్థాయిలోనైనా రాణిస్తారని,అవకాశాలను అంది పుచ్చుకొని ముందుకు సాగాలని తెలిపారు. అనంతరం ఆయా రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న 25 మంది మహిళలకి విశిష్ట మహిళా రమాబాయి అంబేద్కర్ పురస్కారం 2025 అవార్డులను అతిథుల చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమానికి ఉప్పులేటి నరేష్ అధ్యక్షత వహించగా ప్రైమరీ హెల్త్ సెంటర్ మెడికల్ అధికారి డాక్టర్ గడప మానస,ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మామిడిపల్లి బాపయ్య,రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు,రాష్ట్ర ఉపాధ్యక్షులు మైస రాజేష్,జిల్లా కన్వీనర్ నెరువట్ల రాజలింగు, కోకన్వీనర్లు కొల్లూరి రవికుమార్,ఆసంపల్లి శ్రీనివాస్, దర్శనాల నవీన్,బండ శాంకరి,ఉప్పులేటి గోపిక, చిలుక శేఖర్,అంతడపుల మధు,లు పాల్గొనగా చిన్నారులు అమూల్య, బ్రింద,తపస్య,విష్ణు ప్రియ, శార్వాణి బృందం ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి.

## పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య పౌష్టికాహారాన్ని అందించాలి.

**మండల విద్యాధికారి యాదగిరి**



**నిజాంపేట,మార్చి17(సూర్యరేఖ)** మండల పరిధిలోని వెంకటాపూర్ (కె)గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సోమవారం మండల విద్యాధికారి యాదగిరి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టిక ఆహారాన్ని అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.వేసవికాలంలో ఎండలు విపరీతంగా వీస్తున్న నేపథ్యంలో ఎండ దెబ్బ తగలకుండా విద్యార్థులు ఇండ్లలోనే ఉంటూ చదువుపై దృష్టి సారించేలా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఆర్టిజన్ల అక్రమ అరెస్టులు..



**నిజాంపేట,మార్చి17(సూర్యరేఖ)** విద్యుత్ ఆర్టిజన్ల నిజాంపేట పోలీసులు అక్రమ అరెస్టు చేసి సోమవారం పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా ఆర్టిజన్లు మాట్లాడుతూ ఏలాంటి నిరసన కార్యక్రమాలకు ఆర్టిజన్లకు సంబంధించి పిలుపు లేదని అయినా ఎలాంటి సమాచారం లేకుండానే మమ్మల్ని అరెస్టు చేయడం శోచనీయంగా ఉందని ఆర్టిజన్లు ఆరోపించారు.ఆర్టిజన్ కార్మికులు ప్రతినిత్యం పనిచేయడం వల్లే నిరంతరం విద్యుత్ సరఫరా వస్తుందని ఇలా అరెస్టులు చేయడంతో విద్యుత్ సమస్యలు తలెత్తుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టిజన్లు రాజు,ప్రవీణ్,తదితరులు పాల్గొన్నారు.

## చిలుకానగర్ శివాలయం పున:నిర్మాణానికి భారీ విరాళం ప్రకటించిన పూస అశోక్ దంపతులు



**ఉప్పల్,మార్చి17 (సూర్యరేఖ)** చిల్కానగర్ శివాలయం పునఃనిర్మాణానికి చిల్కానగర్ వాస్తవ్యులు,నలంద పాఠశాల యజమానులు పూస విజయలక్ష్మి,అశోక్ దంపతులు రూ.5,01,116 లక్షలు విరాళం ప్రకటించారు, అందులో భాగంగా సోమవారం రూ.1 లక్ష ఆలయకమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారికి కమిటీ ఆధ్వర్యంలో భగవంతుని మంగళ శాసనాలతో పాటు, దంపతులను శాలువతో సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారి కుటుంబ సభ్యుల దాతృత్వానికి ధన్యవాదాలు తెలియచేస్తూ,ఆ పరమేశ్వరుడు వారికి,వారి కుటుంబ సభ్యులకు ఆయురారోగ్యాలను,అష్టైశ్వర్యాలను ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో ఆలయకమిటీ అధ్యక్షులు దాసరి కృష్ణ,శంబు ప్రసాద్,కోశాధికారి పంతంగి అమృత్ రావు,దేవసాని బాలచందర్,జల్లి మోహన్,దేవాలయ అర్చకులు ఉదయ్ కుమార్ శర్మ ,గోనె అంజయ్య ,పాల్వంచ విట్ఠల్,సంఘీ స్వామి యాదవ్,బోడ విద్యాసాగర్, షామీర్పేట చంద్రయ్య ,ఆర్.బాలరామ్,కావలి నరసింహ,సకినాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో శివాలయం మొదటి అంతస్తు స్లాబ్ వేస్తాం

**ఆలయ కమిటీ అధ్యక్షులు దాసరి కృష్ణ**



**ఉప్పల్,మార్చి17 (సూర్యరేఖ)** హరిహర క్షేత్రం శ్రీ చిలుకశ్వేర అంజనేయు స్వామి,శ్రీ గాయత్రి దేవాలయం,చిల్కానగర్ శివాలయం పున్నరునిర్మాణం పనుల్లో భాగంగా మొదటి అంతస్తు స్లాబ్ తర్వలో వేయడం జరుగుతుందని ఆలయ కమిటీ అధ్యక్షులు దాసరి కృష్ణ తెలిపారు.స్లాబ్ నిర్మాణంకోసం అవసరమైన రెడీమిక్స్ కాంక్రీట్ ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇవ్వడం జరిగిందని,అలాగే స్లాబ్ కోరకు అవసరమైన స్టీల్ ను చిల్కానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ అందజేశారు.అందులో భాగంగా ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యేకు సంబంధించిన వంశీ, బన్నాల ప్రవీణ్,లు వచ్చి సెంట్రగ్ స్లాబ్ పనులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ అధ్యక్షులు దాసరి కృష్ణ,కమిటీ సభ్యులు గోనె అంజయ్య,ఆడెపు అంజయ్య,కావాలి నర్సింహ్మా, బొమ్మ రమేష్,సిక్కరి కృష్ణ,గుర్రాల మల్లేష్ ఉన్నారు.

# క్రికెట్ మ్యాచ్ ల నిర్వహణకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నాం




**రాచకొండ సిపి. సుధీర్ బాబు**

**మార్చి 23 నుండి మే 21 వరకు ఉప్పల్ రాజీవ్ గాంధీ స్టేడియంలో తొమ్మిది ఐపిఎల్ మ్యాచ్ ల నిర్వహణ..**

**స్టేడియం చుట్టూ 450 సీసీ టీవీ కెమెరాలతో పరిరక్షణ..**

**ప్రవేశ మార్గాల్లో అనుమతి లేని తినిబండారాలు వ్యాపారులను అనుమతించొద్దు..**

**టికెట్ల పంపిణీలో గందరగోళం ఏర్పడకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలి..**

**ఉప్పల్,మార్చి17(సూర్యరేఖ)** ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో మార్చి 23 నుండి జరగనున్న 18వ ఎడిషన్ టాటా ఐపీఎల్ 2025 క్రికెట్ పోటీల నిర్వహణకు సంబంధించిన భద్రతా ఏర్పాట్ల గురించి రాచ కొండ కమిషనర్ సుధీర్ బాబు రాచకొండ కార్యాలయంలో డీసీపీలు,ఏసిపిలు,హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు,ఉప్పల్ స్టేడియం అధికారులు,సన్ రైజర్స్ టీమ్ ప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సీపీ సుధీర్ బాబు ఐపీఎస్ మాట్లాడుతూ. రాచకొండ కమిషనరేట్ పరిధిలో జరగనున్న మ్యాచ్ ల నిర్వహణకు అవసరమైన అన్ని రకాల సెక్యూరిటీ పరమైన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. భద్రతాపరమైన ఉల్లంఘనలకు, అవాంఛనీయ సంఘటనలకు అవకాశం ఇచ్చే ల్యాప్ టాప్ లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, అగ్గిపెట్టెలు, పదునైన వస్తువులు, బయట నుంచి తెచ్చే తినుబండారాలు, వాటర్ బాటిల్స్ వంటి వాటిని స్టేడియంలోనికి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించ కూడదని అధికారులను ఆదేశించారు. భారీ సంఖ్యలో క్రికెట్ అభిమానులు హాజరయ్యే అవకాశం ఉండటం వల్ల ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని,కార్లు, ద్విచక్ర వాహనాలకు విశాలమైన పార్కింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సాధారణ వాహనదారుల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా,ఉప్పల్ ప్రధాన రహదారి మీద ట్రాఫిక్ జామ్ ఏర్పడకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.స్టేడియం చుట్టూ దాదాపు 450 సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్టు,వాటి ద్వారా స్టేడియం పరిసరాలను ఎలక్ట్రానిక్ నిఘా నీడలో ఉంచనున్నట్టు,ప్రతీ ఒక్కరి కదలికలూ సీసీటీవీ కెమెరాల్లో నిక్షిప్తం అవుతాయని పేర్కొన్నారు.సివిల్,ట్రాఫిక్,రిజర్వ్ పోలీసులు, ఎస్ఓటి వంటి పలు విభాగాల అధికారులు, సిబ్బంది బందోబస్తు విధుల్లో ఉంటారని తెలిపారు.టికెట్ల పంపిణీలో ఎటువంటి గందరగోళం లేకుండా చూడాలని ఐపీఎల్ నిర్వహణ బృందానికి సూచించారు.స్టేడియం ప్రవేశ మార్గాల్లో అనుమతి లేని వీధి వ్యాపారులను అనుమతించకూడదని, స్టేడియం లోపల ఆహార పదార్థాలను, శీతల పానీయాలను విక్రయించేవారు ఒకే రకమైన దుస్తులను ధరించాలని సూచించారు.ఈ సమావేశంలో డిసిపి మల్కాజ్ గిరి పద్మజ డిసిపి క్రైమ్ అరవింద్ బాబు,డిసిపి అడ్మిన్ ఇందిర,డీసీపీ స్పెషల్ బ్రాంచ్ జి.నరసింహారెడ్డి,ట్రాఫిక్ డిసిపి మల్లారెడ్డి, డిసిపి ఎస్ఓటి రమణారెడ్డి,డిసిపి హెడ్ క్వార్టర్ శ్యాంసుందర్, అడిషనల్ డీసీపీలు,ఏసీపీలు, ఐపిఎల్ ప్రతినిధులు,ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మనిషి శారీరక,మానసిక ఆరోగ్యంలో పౌష్టికాహారానిదే కీలకపాత్ర

**అధిక పురుగుమందుల వినియోగం వల్ల కూరగాయలు కూడా కలుషితం..**

**ఆహారం విషయంలో అనేక జాగ్రత్తలు తీసుకోవాలి..**

**వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.ఈ.హెచ్ విద్యాసాగర్**




**రాజేంద్రనగర్,మార్చి 17**మనిషి శారీరక,మానసిక ఆరోగ్యంలో పౌష్టికాహారానిదే కీలకపాత్ర అని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.ఈ.హెచ్ విద్యాసాగర్ అభిప్రాయపడ్డారు. విశ్వవిద్యాలయం నాలెడ్జ్ మేనేజ్మెంట్ సెంటర్ హాల్ లో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...నేడు అధిక పురుగుమందుల వినియోగం వల్ల కూరగాయలు కూడా కలుషితం అవుతున్నాయని అన్నారు.తద్వారా అనేక దుష్ఫలితాలు సంభవిస్తున్నాయన్నారు.అందుకే ఆహారం విషయంలో అనేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ అడ్వాన్సుడ్ ఫ్యాకల్టీ ట్రైనింగ్ ఇన్ కమ్యూనిటీ సైన్స్,పోస్ట్ గ్రాడ్యుయేట్ రీసర్చ్ సెంటర్ 21 రోజుల పాటు నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మానసిక, పోషకాహార నాణ్యతలు,వ్యక్తి వికాసంపై ఉండే ప్రభావం అన్న అంశంపై నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల వ్యవసాయ,ఉద్యాన విశ్వవిద్యాలయాల బోధనా సిబ్బంది పాల్గొన్నారు.మారుతున్న పరిస్థితుల వల్ల నేడు ప్రతి ఇంటిలోనూ మానసిక సమస్యలు వస్తున్నాయని రిజిస్ట్రార్ అన్నారు. అలాగే ఉబకాయం వంటి సమస్యలు సర్వసాధారణం అయ్యాయన్నారు.ఈ తరుణంలో ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు చాలా ఉపయోగం అని విద్యాసాగర్ అభిప్రాయపడ్డారు.రాష్ట్రంలోని వ్యవసాయదారుల్లో సుమారు 68 శాతం సన్న, చిన్నకారు రైతులేనని ఈ కార్యక్రమం గెస్ట్ ఆఫ్ హానర్, వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్లానింగ్ అండ్ మానిటరింగ్ సెల్ డైరెక్టర్ డాక్టర్ టి.శశికళ అన్నారు. ఆ కుటుంబాల్లోనే పౌష్టికాహార లోపం ఎక్కువగా ఉంటుందని ఆమె వివరించారు.అటువంటి వారికి కౌన్సెలింగ్ చాలా అవసరం అని శశికళ అన్నారు.ఈ సందర్భంగా శిక్షణ ముగించుకున్న వారందరికీ రిజిస్ట్రార్ పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ కమ్యూనిటీ సైన్స్ డీన్ డాక్టర్. విజయలక్ష్మి, క్యాఫ్ట్ సంచాలకులు డాక్టర్ టి.సుప్రజ, కోర్సు నిర్వహణ బాధ్యులు డాక్టర్ పి.శ్రీదేవి,డాక్టర్ పి. జానకి శ్రీనాథ్,డాక్టర్ జి.స్వరూప రాణి,తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ




## ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**నాచారం,మార్చి17 (సూర్యరేఖ)** నాచారం డివిజన్లోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలలో పదవ తరగతి చదువుతున్న 508 మంది విద్యార్థులకు ఈ నెల 21వ తేదీన జరగబోయే పరీక్షలకు పరీక్ష సామాగ్రిని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ ఆధ్వర్యంలో ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా సోమవారం అందజేశారు.ఇందిరా స్కూల్లోని సుమారు 160 మంది విద్యార్థులందరికీ ఎగ్జామ్ పాడ్స్,పెన్ను పెన్సిల్ షార్ప్నర్ రబ్బర్ స్కేల్ అందజేయడం జరిగింది. మిగతా అన్ని స్కూల్లలో సోమవారం సాయంత్రం వరకు ప్రతి విద్యార్థికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇందిరా స్కూల్ ప్రిన్సిపల్ అప్సర్,బారాసా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై కారు డివైడర్ కు ఢీకొని తృటిలో తప్పిన ప్రమాదం..



**రామయంపేట,మార్చి17 (సూర్యరేఖ)** ఆర్మూర్ నుంచి హైదరాబాద్ వెళుతున్న న్యూ బొలెరో కారులో వస్తుండగా రామాయంపేట మండల కేంద్రంలో పెద్దమ్మ ఆలయం వెనుక జాతీయ రహదారిపై డివైడర్ కు కారు ఢీకొనగా టైరు పేలిపోయింది.దీంతో పల్టీలు కొట్టి కారు రోడ్డు కిందికి దూసుకుపోయింది.దాంతో కారు ముందు భాగము డివైడర్ కు ఢీకొనడంతో నుజ్జునుజ్జయింది.ఈ ప్రమాదంలో తన తోటి సోదరుడు హరికి తనకు ఏలాంటి గాయాలు కాలేదని తెలిపారు.ఈ ప్రమాదం తృటిలో తప్పిందని యజమాని పి.మహేష్ తెలిపారు.ఈ మేరకు రామాయంపేట పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు అయన తెలిపారు.

## కడుపునొప్పి భరించలేక వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య..



**రామాయంపేట,మార్చి17 (సూర్యరేఖ)** రామాయంపేట మండలం దొంగల ధర్మారం గ్రామంలో మాసాయిపేట పురుషోత్తం (34) ఆదివారం రాత్రి అందాజా 10 గంటల సమయంలో అందరు ఇంట్లో భోజనం చేసిన అనంతరం పురుషోత్తం తను పొలానికి నీళు పెట్టడానికి వెళ్లి తిరిగి రాకపోయేసరికి కుటుంబీకులు పొలానికి వెళ్లి అక్కడ వెతకగా పొలంలో ఉన్న చింత చెట్టుకు తాడుతో ఊరి వేసుకొని మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు.మృతదేహాన్ని రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం కోసం తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారనీ తెలిపారు.మృతునికి ఇదివరకు కడుపునొప్పి,ఆర్థిక సమస్యల వలన జీవితంపై విరక్తి చెంది మృతి చెందినట్లు పేర్కొన్నారు.కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బాలరాజ్ తెలిపారు.

## ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి వ్యక్తి మృతి..



**రామయంపేట,మార్చి17 (సూర్యరేఖ)** రామాయంపేట మండలం ఆర్ వెంకటపూర్ గ్రామానికి చెందిన పుర్ర రాములు (36) ఈనెల 11న మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగగా తదుపరి అతన్ని చికిత్స నిమిత్తం కొరకు రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిగా అక్కడ నుండి మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆసుపత్రి హైదరాబాదుకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి సమయంలో మరణించాడు.మృతుడు ఆర్థిక కారణాల వలన జీవితంపై విరక్తి చెంది గడ్డి మందు త్రాగి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు.తండ్రి పర్ర కిషన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బాలరాజ్ తెలిపారు.

# మైలర్ దేవ్ పల్లిలో సమస్యల పరిష్కారానికి కృషి..





**ఎమ్మెల్యే సహకారంతో ప్రతి సమస్యను పరిష్కరిస్తా..**

**ఏ సమస్య ఉన్నా నా దృష్టికి తీసుకురండి..**

**కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టి.ప్రేమ్ గౌడ్**

**రాజేంద్రనగర్,మార్చి17** మైలర్ దేవ్ పల్లి డివిజన్లో రాజేంద్రనగర్ నియోజకవర్గం శాసనసభ్యులు టి.ప్రకాష్ గౌడ్ సహకారంతో అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేయడం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టి.ప్రేమ్ గౌడ్ అన్నారు. డివిజన్లో నెలకొన్న ప్రతి సమస్యను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి పెద్ద ఎత్తున కృషి చేయడం జరుగుతుందని తెలిపారు.సోమవారం డివిజన్ పరిధిలో స్మశాన వాటిక, మధుబన్ కాలనీలోని ప్లే గ్రౌండ్లో ఆయన అధికారుల సహకారంతో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయించారు.ఈ సందర్భంగా టి.ప్రేమ్ గౌడ్ మాట్లాడుతూ. మైలర్ దేవ్ పల్లి డివిజన్లో నెలకొన్న ప్రతి సమస్యను తెలుసుకోవడం,దాని పరిష్కారానికి అధికారులు సహకారంతో పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. డివిజన్ లోని అన్ని బస్తీలలో గతంలో విస్తృతంగా తిరిగి సమస్యలు తెలుసుకోవడం జరిగిందన్నారు.అన్ని సమస్యలను దశల వారీగా ఎమ్మెల్యేతో మాట్లాడి పనులు పూర్తి చేయించడం జరుగుతుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్,సర్కిల్ అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కార దిశగా పనిచేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజలకు అవసరమైన రోడ్లు,డ్రైనేజీ,విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయటానికి కృషి చేయడంతో పాటు తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తానని తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తానని టి.ప్రేమ్ గౌడ్ తెలిపారు. లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందే విధంగా తన వంతు కృషి చేస్తున్నానని వివరించారు. ఇప్పటికే చాలా బస్తీలలో ప్రజా సమస్యలను పరిష్కరించడం జరిగిందని, మిగిలిపోయిన పనులను కూడా త్వరలో పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు.ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని వాటిని అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మధువన్ కాలనీ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కాలనీ వాసులు అర్జున్ గౌడ్,ఆంజనేయులు మేస్త్రి,రామకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

## ఉప్పల్ డివిజన్ బిజెపి అధ్యక్షునిగా మార్నేని ఫణేందర్ నియామకం..



**ఉప్పల్,మార్చి 17(సూర్యరేఖ)** ఉప్పల్ డివిజన్ బిజెపి అధ్యక్షులుగా మార్నేని ఫణిందర్ ను నియమిస్తూ బిజెపి మేడ్చల్ జిల్లా ఎన్నికల అధికారి టి.ఆచారి అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షులుగా ఎన్నికైన ఫణిందర్ మాట్లాడుతూ...తనపై నమ్మకం ఉంచి అధిష్టాన వర్గం డివిజన్ అధ్యక్షునిగా నియమించినందుకు పార్టీ సీనియర్ నాయకులకు, జిల్లా నాయకులకు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.డివిజన్లో పార్టీ ప్రతిష్ట కోసం పనిచేస్తానని,అధిష్టాన వర్గం నిర్ణయించే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అవసరమైన కార్యక్రమాలు చేపడతానన్నారు.గ్రేటర్ ఎన్నికల సమయానికి డివిజన్లో పార్టీని మరింత బలోపేతం చేయడానికి అవసరమైన కార్యక్రమాలు చేపడతానని వెల్లడించారు.పార్టీ కోసం పనిచేసే ప్రతి నాయకుడిని పార్టీ గుర్తిస్తుందని అనడానికి తన నియామకమే ఒక ఉదాహరణ అని పేర్కొన్నారు. డివిజన్లోని అందరి సీనియర్ నాయకులను కలుపుకొని ముందుకు వెళ్తానన్నారు.

# గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



**మందమర్రి,మార్చి 17 (సూర్యరేఖ)** గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన సోమవారం మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పట్టణ ఎస్సై శివనీతి రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం...మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని అందుగుల పేట జాతీయ రహదారి 363 ఫ్లైఓవర్ ముగింపు ప్రదేశం పక్కనగల కాలి ప్లాట్ నందు నీలిరంగు చొక్కా,జీన్స్ ప్యాంట్ ధరించి,సుమారు 45 నుండి 50 సంవత్సరాల వయసు గల ఒక వ్యక్తి మృతిచెంది ఉన్నారు. స్థానికుల సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుని ప్యాంటు జేబులను పరిశీలించగా బెల్లంపల్లి నుండి మంచిర్యాల వైపుకు వెళ్తున్న పల్లె వెలుగు బస్సులో ఆదివారం మధ్యాహ్నం 12 గంటల 32 నిమిషాలకు ప్రయాణించినట్టు టికెట్ లభించిందని,ఇట్టి సంఘటనపై మందమర్రి మున్సిపాలిటీ వార్డు అధికారి సుంకిశాల రాజేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి,మృతదేహాన్ని మంచిర్యాలలోని మార్చురీకి తరలించామని,ఇతని ఆచూకీ తెలిసిన వారు ఎవరైనా ఉంటే మందమర్రి పోలీస్ ఠాణా చరవాని నంబరు 8712656570 కు సంప్రదించాలని ఎస్సై రాజశేఖర్ కోరారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం..



**శివంపేట,మార్చి 17 (సూర్యరేఖ)** శివంపేట్ మండలంలోని దంతాన్ పల్లి గ్రామానికి చెందిన కన్నారం బుచ్చయ్య కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మరణించడం జరిగింది.గ్రామస్తుల ద్వారా మన ప్రియతమ నాయకుడు ఆపద్బాంధవుడు శివంపేట్ మండల పిఎసిఎస్ చైర్మన్ చింతల వెంకటరామిరెడ్డి వారి కుటుంబానికి తన సొంత డబ్బులు రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు గొల్ల లింగం, గ్రామ కాంగ్రెస్ నాయకులు,యువకులు,గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీలో బీసీ బిల్లు ప్రవేశపెట్టడం హర్షనీయం..

**అగ్రికల్చర్ యూనివర్సిటీ బిసి ఉద్యోగులు**



**రాజేంద్రనగర్,మార్చి17** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టడం హర్షనీయమని అగ్రికల్చర్ యూనివర్సిటీ బిసి ఉద్యోగుల అధ్యక్షులు పి.బిక్షపతి,ప్రధాన కార్యదర్శి ఎం.దశరథ్,ఉపాధ్యక్షులు ఎం.రమేష్,కార్యదర్శి ఎం. కృష్ణ,సంతోష్ గౌడ్,రజనీకాంత్,లు అన్నారు.ఈ మేరకు బీసీ బిల్లుకు మద్దతు తెలిపిన బిజెపిలకు బిసి సమాజం తరపున ధన్యవాదాలు తెలిపారు.ఇదో శుభ పరిణామం అని కొనియాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..దీనికి మద్దతుగా సహకరించినందు కు అన్ని రాజకీయ పార్టీలకు కృతజ్ఞతలు తెలియజేయడం జరుగుతుందని,అసెంబ్లీలో రేవంత్ రెడ్డి అఖిలపక్షంతో సహా పార్లమెంట్లో పోరాటం చేసి 42 శాతం బీసీ బిల్లును ఆమోదం చేస్తామని చెప్పడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.


## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన బండారి గంగాధర్



**శివంపేట,మార్చి 17 (సూర్యరేఖ)**మెదక్ జిల్లా శివంపేట్ మండలంలోని పిల్లుట్ల గ్రామానికి చెందిన పిల్లి గోనయ్య మృతిచెందారు.ఈ విషయం మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రముఖ సంఘ సేవకులు బండారి గంగాధర్,పిల్లి గొన్నయ్య మృతదేహానికి సందర్శించి నివాళులర్పించారు.అలాగే వారి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చీ అంత్యక్రియలకు ఆర్థిక సహాయాన్ని అందజేయడం జరిగింది.వారి కుటుంబానికి ఎలాంటి ఇబ్బందులు ఉన్న నాతోని సహాయ సహకారాలు అందిస్తానని చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమంలో బండారి ముత్యాలు,గుల్లయ్యగారి కిష్టయ్య,పిల్లి చంద్రయ్య,పిల్లి రామాంజనేయులు,కానుకుంట బాలయ్య,మాజీ విద్యా కమిటీ చైర్మన్ పిల్లి మధు,పిల్లి నరసింహులు,పిల్లి మధు,గుర్రాల గణేష్, బిజిఆర్ యువసేన అధ్యక్షులు కుమ్మరి నాగరాజు, బండారి సాయికిరణ్,పిల్లి శివకుమార్,పిల్లి చంద్రయ్య,కానుకుంట నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

# 'ప్రజావాణి' పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి






**అవకాశం ఉన్న ప్రతి ఫిర్యాదును పరిష్కరిస్తాం..**

**ప్రజావాణికి రెండు ఫిర్యాదులు..**

**రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.రవికుమార్**

**రాజేంద్రనగర్,మార్చి17** ప్రజావాణిలో బాధితుల నుంచి స్వీకరించిన ఆర్జీలకు ప్రాధాన్యతనిస్తూ పరిష్కరిస్తున్నామని వెంటనే రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె. రవికుమార్ తెలిపారు.సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో బాధితులు మూడు ఫిర్యాదులు చేశారు.అర్జీలు సమర్పించేందుకు వచ్చిన వారితో నేరుగా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.రవికుమార్ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.వీలైనంత త్వరగా పరిష్కరించేలా చూస్తానని హామీ ఇచ్చారు.ప్రజావాణిలో ఎలక్ట్రికల్ కు సంబంధించిన ఒక ఫిర్యాదు,పన్ను సవరణ సంబంధించిన ఒక ఫిర్యాదు చొప్పున అందినట్టు డిసి తెలిపారు.ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.రవికుమార్ మాట్లాడుతూ...క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకొని,ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్ ఉంచకుండా సత్వరమే పరిష్కరిస్తామని వెల్లడించారు.వచ్చిన అర్జీలను పరిశీలించి,పెండింగ్లో లేకుండా సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులతో చర్చించి పరిష్కరిస్తున్నామని,లేనిపక్షంలో వారికి తగిన సూచనలు ఇవ్వడం జరుగుతుందని వెల్లడించారు ఏదైనా వీలుపడని సమస్య ఉంటే సమస్యను సైతం పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తున్నామని వెల్లడించారు. ప్రజాసమస్యల పరిష్కారంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామని వెల్లడించారు.ప్రజావాణి కార్యక్రమంలో సర్కిల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వంద శాతం ఆస్తి పన్ను వసూలే లక్ష్యం

**ఆస్తిపన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి..**
**ఈ ఆర్థిక సంవత్సరం ఆస్తిపన్ను లక్ష్యం..రూ.54 కోట్లు**
**ఇప్పటివరకు రూ.42 కోట్లు వసూలు..**
**మిగతా రూ.12 కోట్లు వసూలు కావలసి ఉంది..**
**ఇక మిగిలింది 14 రోజులే..**
**ఆస్తి పన్ను వసూళ్లపై సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే.రవికుమార్ అధికారులతో సమీక్ష..**




**రాజేంద్రనగర్,మార్చి 17** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరం (2024 25) ఆస్తిపన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే.రవికుమార్ ఆదేశించారు.సోమవారం సర్కిల్ కార్యాలయంలోని డిసి ఛాంబర్లో నోడల్ అధికారుల బృందంతో సమీక్ష సమావేశం నిర్వహించారు.పన్ను వసూళ్ల కోసం డిప్యూటీ కమిషనర్ రూపొందించిన కార్యాచరణ ప్రకారం ముందుకెళ్లాలని కమిషనర్ ఆదేశించారు.

**ఆస్తి పన్నుల బకాయిపై విధించిన వడ్డీపై 90 శాతం**

ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ...ఆస్తి పన్నుల బకాయిపై విధించిన వడ్డీపై 90 శాతం రాయితీతో పన్ను చెల్లింపుదారులపై భారం తగ్గినట్లయ్యిందని తెలిపారు. టీంల వారీగా ఉదయాన్నే సమయానికి క్షేత్రస్థాయికి చేరుకోవాలన్నారు.పన్ను వసూళ్లు వేగంగా, విజయవంతంగా పూర్తి చేయాలంటే రోజువారీ లక్ష్యం మేరకు పన్నులు వసూలు చేయాలని కే.రవికుమార్ కచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు.ఆస్తి పన్ను బకాయిలపై ప్రభుత్వం 90 శాతం వడ్డీ రాయితీ ప్రకటించడంతో ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ కమిషనర్ కే.రవికుమార్ సూచించారు.ప్రస్తుత సంవత్సరం బకాయిలు రూ.54 కోట్లు వసూలు లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందని, ఇప్పటివరకు రూ.42 కోట్లు వసూలు అయ్యాయని,మిగతా రూ.12 కోట్లు వసూలు కావలసి ఉందన్నారు.ఇప్పటికి 79 శాతం ఆస్తి పన్నులు వసూలు అయ్యాయని వెల్లడించారు. ఇక 14 రోజులే మిగిలి ఉందని, మిగతా 21శాతం వసూలు చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నామని తెలిపారు. మిగతా ఈనెల 31వ తేదీలోపు టార్గెట్ పూర్తిచేయాలని ఆదేశించారు.ఆ దిశగా అందరూ కష్టపడి పనిచేయాలని సూచించారు.ఎవరికి వారు తమకు కేటాయించిన వార్డులలో ఇంటింటికీ తిరిగి ఆస్తి పన్నులు రాబట్టాలన్నారు.ఎవరైనా స్పందించకుంటే వెంటనే ఆ దుకాణాలను సీజ్ చేయాలన్నారు.ఈ సమావేశంలో సర్కిల్ ఏఎంసి జయప్రకాష్,ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అధికారుల సమన్వయంతో చర్యలు





## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**బెల్లంపల్లి,మార్చి17 (సూర్యరేఖ)** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించే దిశగా సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.సోమవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్,మంచిర్యాల,బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు శ్రీనివాస్,హరికృష్ణ,లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జైపూర్ మండలం గుత్తదార్ పల్లి గ్రామస్తులు తమ గ్రామంలోని ఇండ్లు శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు క్రింద కోల్పోయామని,నష్టపరిహారం రావలసినవారికి ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కోటపల్లి మండలం సిర్స గ్రామానికి చెందిన పూజారి బక్కమ్మ తన భర్త పేరిట ఉన్న ఇంటిని ఆయన మరణానంతరం తన పెద్ద కుమారుడు తమకు ఎలాంటి సమాచారం లేకుండా తన పేరిట మార్చుకున్నాడని,ఇట్టి మార్పును రద్దు చేసి తమకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.కన్నేపల్లి మండలం చింతపూడి లింగాల గ్రామస్తులు తమ గ్రామంలో గుడుంబా,బెల్ట్ షాపులు నిర్వహించడంతో గ్రామ యువత పెడదారి పడుతున్నారని,ఈ విషయంపై విచారించి గుడుంబా, మద్యం విక్రయాలను నియంత్రించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.జన్నారం మండలం కవ్వాల్ గ్రామానికి చెందిన భోజనపు సురేందర్ నిరుపేద అయిన తనకు ఉపాధి కల్పించాలని కోరుతూ గతంలో దరఖాస్తు చేసుకున్నారని,అవకాశం కల్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మంచిర్యాల పట్టణానికి చెందిన మహమ్మద్ ఆసిఫ్ పాషా తాను పుట్టుకతో నిరుపేద దివ్యాంగుడిని అని, ఎస్.ఎస్.సి.పూర్తి చేశానని,ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.మంచిర్యాల జిల్లా మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం ప్రతినిధులు తమ దరఖాస్తులో హైదరాబాద్ జి.హెచ్.ఎం.సి. కార్మికులకు అందిస్తున్న వేతనాలను జి.ఓ.ప్రకారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కార్మికులకు అందించాలని కోరారు.లక్షెట్టిపేట మండలం తలమల గ్రామానికి చెందిన గిరిజన రైతులు తమ వ్యవసాయ భూములలో బోరు బావి ఏర్పాటు చేయాలని,బోర్ డ్రిల్లింగ్ అయిన రైతుల సంబంధిత భూములలో మోటార్లు బిగించి ఆదుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు.జన్నారం మండల అభివృద్ధి కమిటీ ప్రతినిధులు జన్నారం మండల కేంద్రంలో ప్రజల సౌకర్యార్థం 30 పడకల సామాజిక ఆసుపత్రి మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణానికి చెందిన సురేష్ కుమార్ తాను కుటుంబ సర్వే దరఖాస్తుల డాటా ఎంట్రీ పని చేశానని, సంబంధిత డబ్బులు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు,అర్జీదారులు పాల్గొన్నారు.

## సిద్ధార్థ కళాశాలలో మాస్ కాఫీ జరుగుతోంది.

**టిజివిపి.**



**కామారెడ్డి,మార్చి17(సూర్యరేఖ)**ంకామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట పట్టణంలో ఉన్నటువంటి సిద్ధార్థ కళాశాలలో మాస్కాపింగ్ జరుగుతుందని కలెక్టర్ కి వినతి పత్రం అందజేశారు టిజివిపి కామారెడ్డి జిల్లా అధ్యక్షులు గంధం సంజయ్ ఆధ్వర్యంలో ఈ వినతి పత్రం అందజేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ...సిద్ధార్థ కళాశాలలో 99 మంది విద్యార్థులు చదువుతున్నారని వారి దగ్గర నుండి కళాశాల యజమాన్యం మీకు చిట్టీలు అందిస్తామని చెప్పి ఒక్కో విద్యార్థి చొప్పున పదివేల రూపాయలు చొప్పున వసూలు చేశారని వాపోయారు. ఇందులో జిల్లాలో ఉన్నటువంటి ముఖ్య అధికారుల హస్తం కూడా ఈ మాస్ కాపీయింగ్ వెనుక హస్తముందని వారు పేర్కొన్నారు.ముఖ్యంగా ఇంటర్మీడియట్ అధికారి సలాం హస్తం ఎక్కువగా ఉందని వారు ఆరోపించారు.ఉజ్వల భవిష్యత్తు అయినటువంటి ఇంటర్ విద్యార్థుల జీవితాలు రేపటి తెల్లారి మార్కుల్లో చిన్న విన్నం అవ్వడానికి దారితీస్తుందని, దయచేసి వెంటనే కలెక్టర్ స్పందించి కళాశాల గుర్తింపును రద్దు చేయాలని,అలాగే మాస్ కాపీయింగ్ వెనకాల నడుపుతున్నటువంటి జిల్లా కేంద్రంలో ఉన్న అటువంటి ముఖ్య అధికారుల పదుల నుండి వెంటనే తొలగించాలని కలెక్టర్ ని వారు కోరారు. లేనియెడల జిల్లాలో పెద్ద ఎత్తున ధర్నాలు రాస్తారోకులు చేస్తామని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో టిజివిపి కామారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి ఎండి సమీర్ పాల్గొన్నారు.

## అభివృద్ధి పైన దృష్టి పెట్టండి

**శివంపేట బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రమణ గౌడ్.**



**శివంపేట,మార్చి17(సూర్యరేఖ)** కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ నాయకుల దిష్టిబొమ్మను దహనం చేసి పైశాచిక ఆనందం పొందుతున్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్ అన్నారు.మెదక్ జిల్లా శివంపేట మండల కేంద్రంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు.మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డిని సస్పెండ్ చేయడానికి తీవ్రంగా ఖండించారు. గ్రామాలలో ప్రజలు త్రాగునీరు,విద్యుత్ లేక ఇబ్బంది పడుతున్నారని, కాంగ్రెస్ నాయకులు ఏ సమస్య పట్టించుకోవడంలేదని వారు అన్నారు.ప్రజా పాలన అంటూ,ప్రజల సంక్షేమం అంటూ మాటలు చెబుతూ కాలయాపన చేస్తున్నారని, అభివృద్ధిపైన దృష్టి పెట్టండి అని ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ నాయకులను హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్ర గౌడ్,తాజా మాజీ జెడ్పిటిసి పబ్బ మహేష్ గుప్తా,శివంపేట గ్రామ తాజా మాజీ సర్పంచ్ పత్రాల శ్రీనివాస్ గౌడ్,శివంపేట గ్రామ కమిటీ అధ్యక్షులు ముద్దగల లక్ష్మీ నరసయ్య, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## మద్యం దుకాణాలను తనిఖీ చేసిన ఎక్సైజ్ అధికారులు..




**నిజాంపేట,మార్చి17(సూర్యరేఖ)** మండల కేంద్రంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ,నిజాంపేట ఎల్లమ్మ మద్యం దుకాణాలను రామాయంపేట ఎక్సైజ్ సిఐ నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే మద్యం విక్రయించాలన్నారు.అలాగే నౌకరినామ రిజిస్టర్ ను పరిశీలించారు.ఈ తనిఖీలలో ఎక్సైజ్ ఎస్ఐలు విజయ్ సిద్ధార్థ,హరీష్,హెడ్ కానిస్టేబుల్ యాదగిరి,వేణు,కనకరాజు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం సరఫరా...

**సూర్యరేఖ ఎఫెక్ట్**



**శివంపేట,మార్చి17 (సూర్యరేఖ)** ఆదివారం సూర్యరేఖ పత్రికలో ప్రచురించిన “15 రోజులు కావస్తున్న జాడ లేని రేషన్ బియ్యం” కథనానికి స్పందించిన అధికారులు శివంపేట మండల కేంద్రంలోని రేషన్ షాపులకు బియ్యాన్ని సరఫరా చేయడం జరిగింది. రేషన్ బియ్యం లేక చాలా ఇబ్బందులు గురయ్యామని ఇలాంటి పరిస్థితి భవిష్యత్తులో ఎప్పుడూ జరగవద్దని ప్రజలు తెలియజేశారు.


## బీసీ బిల్లుకు తెలంగాణ అసెంబ్లీ ఆమోదించడం పట్ల హర్షం..

**మల్లాపూర్ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కేశవరం ఆంజనేయులు**



**ఉప్పల్,మార్చి 17 (సూర్యరేఖ)** తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం సోమవారం బీసీ రిజర్వేషన్ బిల్లును ప్రభుత్వం ఆమోదించడం పట్ల మల్లాపూర్ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు మాజీ కౌన్సిలర్ కేశవరం ఆంజనేయులు హర్షం వ్యక్తం చేశారు. బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు.బీసీ బిల్లుకు సహకరించిన పార్టీలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ బిల్లు ఆమోదంతో నైనా బీసీలకున్యాయం జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని,ఈ బిల్లుల ద్వారా బీసీ వర్గానికి సంబంధించి విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్లు పగడ్బందీగా అమలయ్యేలా అమలైన ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సూచించారు.బీసీ వర్గాలు సైతం తమ శాతాన్ని పొందేందుకు అవసరమైన కార్యక్రమాలు తీసుకొని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్




**బెల్లంపల్లి,మార్చి17 (సూర్యరేఖ)** బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ఈ నెల 28వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్, ఎగ్జామినేషన్ బ్రాంచ్ కో- ఆర్డినేటర్ మహమ్మద్ రఫీక్, లు తెలిపారు.కళాశాలలో బిఏ,బీకాం,బీఎస్సీ చదువుతున్న రెండవ,నాలుగవ,ఆరవ,సెమిస్టర్ విద్యార్థులు ఈ మేరకు నిర్ణయించిన ఫీజులు మీసేవ ద్వారా,ఇంటర్నెట్ సెంటర్ ద్వారా గాని ఆన్లైన్ లో 'ఆక్టోపాడ్' ద్వారా చెల్లించవలసి ఉంటుందని పేర్కొన్నారు.ఏప్రిల్ లో జరగనున్న రెగ్యులర్,బ్యాక్లాగ్ పరీక్షల నిమిత్తం కాకతీయ విశ్వవిద్యాలయం ఈ అవకాశాన్ని కల్పించిందని వివరించారు. ఇతర వివరాలకు కళాశాల ఎగ్జామినేషన్ బ్రాంచ్ లో కో- ఆర్డినేటర్ రఫీక్ ని ఈ ఫోన్ నెంబర్ 7013530814, 9959269975 లో సంప్రదించాలని ప్రిన్సిపల్ డాక్టర్ కాంపల్లి శంకర్ సూచించారు.

# ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో డ్యూటీ చేయాలి

**ఎస్పీ రాజేష్ చంద్ర**


**కామారెడ్డి, మార్చి17( సూర్యరేఖ)** పోలీసు శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరు క్రమశిక్షణ బాధ్యత కలిగి ఉండి ప్రజలకు సేవ చేయాలని కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు నిజాంసాగర్ మండల కేంద్రంలో సోమవారం పోలీస్ స్టేషన్ కార్యాలయంలో రికార్డులను ఆయన పరిశీలించారు.పలు కేసులకు సంబంధించిన వివరాలను ఎస్ఐ శివకుమార్ నీ అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్లోని సిబ్బందికి పలు సూచనలు చేశారు.కొత్త చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని,పోలీస్ స్టేషన్ ను వచ్చే ఫిర్యాదుల పట్ల తక్షణమే స్పందించి వారికి న్యాయం జరిగేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.ప్రతిరోజు రాత్రి వేళల్లో పెట్రోలింగ్ విస్తృతంగా చేయాలని ఆదేశించారు.పోలీస్ స్టేషన్ పరిధిలో తరచూ వెహికల్ చెకింగ్ నిర్వహిస్తూ డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తున్న ముఖ్యంగా ఫేక్ నెంబర్ ప్లేట్స్ నంబర్ ప్లేట్స్ మార్పుపై ప్రత్యేక దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకోవాలని,ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు.ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తూ నివారణ చర్యలు చేపట్టాలని ఎస్పీ తెలిపారు.గ్రామాల్లో ప్రధాన కోడల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా ప్రస్తుతం జరుగుతున్న వివిధ రకాల ఆన్లైన్లో మోసాల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.సైబర్ నేరాల బారిన పడకుండా



ఎప్పటికప్పుడు ప్రజలను ప్రభుత్వం చేయాలని తెలిపారు. పేకాట జూదం తదితర వంటిపై ప్రత్యేక నిల ఏర్పాటుచేసి వాటిపై ఉక్కు పాదం మోపి అణచివేయాలని పోలీసులను ఆదేశించారు గంజాయి ఇతర మత్తు పదార్థాలు ఎవరైనా అమ్మిన కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో బాన్సువాడ డిఎస్పి సత్యనారాయణ,రూరల్ సీఐ రాజేష్ ఎస్ఐ శివకుమార్ హెడ్ కానిస్టేబుల్ సతీష్, వెంకటస్వామి శ్యామ్ రాజు,వీరభద్ర రాకేష్ గౌడ్,ప్రవీణ్ గౌతమి, కస్తూరి సంగమేశ్వర్,లక్ష్మణ్ తోపాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయం వార్షికోత్సవాలలో పాల్గొన్న తెలంగాణ రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి





**తుర్కయంజాల్,మార్చి17( సూర్యరేఖ)**దమున్సిపాలిటీ 22వ వార్డులో వెలసిన కళ్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయం వార్షికోత్సవాల సందర్భంగా సోమవారం నిర్వహించిన చక్కర స్థానం, కళ్యాణోత్సవంలో ముఖ్యఅతిథిగా తెలంగాణ రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రామ్‌రెడ్డి పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ 22వ వార్డు కౌన్సిలర్, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కొశికె ఐలయ్య , టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త కుర్మా శివకుమార్,టిపిసిసి సభ్యులు కాకుమాను సునీల్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్,కుంట గోపాల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డి,డిఇ బిక్షపతి,గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ జయపాల్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# పరిసర ప్రాంతాల ప్రజల సౌకర్యార్థం రంగనాయక అంబిక మినీ ఫంక్షన్..





**అంబిక ఫంక్షన్ హాల్ ప్రారంభించిన, ఆవుల రాజిరెడ్డి,ఆంజనేయులు గౌడ్,లు**

**కొల్చారం,మార్చి17(సూర్యరేఖ)** కొల్చారం మండలం పరిధిలో రంగంపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన రంగనాయక,అంబిక మినీ ఫంక్షన్ హాల్ ను ముఖ్యఅతిథిగా నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి,మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రెడ్డిపల్లి ఆంజనేయులు గౌడ్,కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగులగారి మల్లేష్ గౌడ్ హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతి ఇంట్లో ఏదో ఒక ఫంక్షన్ ఉంటుందని,సరైన సౌకర్యాలు లేక ఇబ్బంది పడవలసిన అవసరం లేదని నూతనముగా నిర్మించిన ఈ ఫంక్షన్ హాల్ ఇక్కడ పరిసర ప్రాంతాలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని తెలిపారు.ఈ ఫంక్షన్ హాల్ వల్ల నిరుపేదలకు కూడా యజమాన్యం చేయూతనివ్వాలని వ్యాపారం సమృద్ధిగా సాగి మరో మెట్టు ఎదిగేందుకు ఈ ఫంక్షన్ హాల్ వారికి తొలిమెట్టు కావాలని ఫంక్షన్ హాల్ యజమానులైన తాజా మాజీ సర్పంచ్ బండి సుజాత రమేష్,మాజీ విద్యా కమిటీ చైర్మన్ కొమ్ముల రవీందర్ గౌడ్ అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమానికి విచ్చేసి ఫంక్షన్ హాల్ ప్రారంభించిన ముఖ్య అతిథులకు యాజమాన్యం శాలువాతో ఘనంగా సన్మానం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ముత్యంగారి గోవర్ధన్, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి మారెల్లి అనిల్, రంగంపేట గ్రామ శాఖ అధ్యక్షులు కొండ కృష్ణ,మాజీ సర్పంచ్ శ్రీశైలం, నాయకులు పిఎసిఎస్ డైరెక్టర్ దుర్గేష్ గౌడ్,రమేష్ బీసీ సెల్ నాయకులు వెంకట్ గౌడ్, . కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పురిడి విజయకుమార్,గాండ్ల కృష్ణ,గోవర్ధన్ రెడ్డి,జంగిటి నాగరాజు నెల్లిరాజు,బోయిని లలిత,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# కిస్మత్ పురలో హైడ్రా కూల్చివేతలు..సాయంత్రానికి సీసీ రోడ్డు

**గండిపేట్,మార్చి 17** కాలనీల మధ్య రోడ్డు సమన్వయం కోసం అడ్డుగా ఉన్న గోడను హైడ్రా అధికారులు,స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి కూల్చివేశారు.దీంతో పాటు సాయంత్రానికి అక్కడ సిమ్మెంట్ రోడ్డును వేశారు.బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఫార్చ్యూన్ మేడ్ హౌస్ కాలనీ,హర్షిత కాలనీకి మధ్యలో ఉన్న అడ్డుగోడను తొలగించాలని స్థానిక కాలనీవాసులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు.ఈ మేరకు సోమవారం ఉదయం కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి రోడ్డు మధ్యలో ఉన్న తొలగించారు. అయితే, రోడ్డుకు అడ్డంగా కట్టిన గోడను గత ఆరు నెలల క్రితం మున్సిపల్ అధికారులు కూల్చి వేశారు.అయినా, మళ్ళీ తిరిగి అక్రమంగా శ్రీ హర్షిత్ లేఔట్ నిర్వాహకులు రోడ్డు



నిర్మించారు.ఈ నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో స్థాయిలో విచారించి రోడ్డుకు అడ్డంగా ఉన్న గోడను హైడ్రా తొలగించింది.దీంతో పాటు మున్సిపాలిటీ అధికారులతో



కలిసి సాయంత్రం వరకు సిమ్మెంట్ రోడ్డు వేయడంతో పరిసర ప్రాంతాల కాలనీలకు లైన్ క్లియర్ అయింది.స్థానిక ప్రజలు వర్షం వ్యక్తం చేశారు.

# మహనీయుల జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలని కమిషనర్ అమరేందర్ రెడ్డికి వినతి పత్రం..

**బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షులు పట్నం రమేష్ కురుమ**



**తుర్కయంజాల్,మార్చి17(సూర్యరేఖ)**తుర్కయాంజాల్ మున్సిపాలిటీ బహుజన సమాజ్ పార్టీ ఆద్వర్యంలో ప్రజల మార్పు కోసం ప్రజలలో చైతన్యాన్ని నింపడం కోసం తమ జీవితాలనే త్యాగం చేసినటువంటి మహనీయులకు అధికారికంగా జయంతి వేడుకలు జరుపుకోవాలని బిఎస్పి నాయకులు సోమవారం మున్సిపాలిటీ కమిషనర్ అమరేందర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు.బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఏప్రిల్ 5 వ తేదీ,మహాత్మా జ్యోతిరావు పూలే ఏప్రిల్ 11వ తేదీ,బాబా సాహెబ్ అంబేద్కర్,ఏప్రిల్ 14వ తేదీ,ల ఈ ముగ్గురి జయంతి వేడుకలను అధికారికంగా ఘనంగా నిర్వహించాలని తెలియచేయడం జరిగింది.తుర్కయాంజాల్ చౌరస్తాలో జీవనోపాధి కోసం పొట్ట చేతబట్టుకొని వచ్చిన దినసరి కూలీలకు రూ.5 భోజన సదుపాయం ఏర్పాటు చేయాలని, యంజాల్ అంబేద్కర్ చౌరస్తాలో మరుగు దొడ్ల సదుపాయం కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ అధ్యక్షులు పట్నం రమేష్ కురుమ, ఉపాధ్యక్షులు లపంగి రాజు,జంతుక సైదులు,కార్యదర్శి నెమలి సత్యనారాయణ పాల్గొన్నారు.

# ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ పి.ఉదయ్ కుమార్ రెడ్డి



**మెదక్,మార్చి17(సూర్యరేఖ)** మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు పలు సూచనలు చేయడమైనది.సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్ ల సిఐ,ఎస్ఐ,లకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితి,పరిష్కారానికి సూచనలు చేయడం జరిగింది.ప్రజలు నిర్భయంగా,మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియో గించుకుంటూ,వారి వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకొనేల,పోలీసులు ప్రజల కు మరింత దగ్గరయ్యేలా,శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి తెలియజేశారు.ప్రజా సమస్యలుపై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కరిస్తున్నామని తెలియజేశారు.

# రాజీవ్ యువ వికాసం పథకం నిరుద్యోగులకు వరం. పాక జ్ఞానేశ్వరి.



**కామారెడ్డి, మార్చి17( సూర్యరేఖ)** తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ నిరుద్యోగుల జీవనోపాధికై ఆర్థిక సహాయం పథకం ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు పాక జ్ఞానేశ్వరి రవి ప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకం నిరుద్యోగులకు వరమని ఆమె అన్నారు.ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ నిరుద్యోగుల జీవనోపాధికి ఆర్థిక సహాయం చేసేందుకు ప్రవేశపెట్టారని ఆమె అన్నారు.దీనిని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలపడాలని ఆమె ఆకాంక్షించారు.కామారెడ్డి జిల్లాలో అర్హులైన నిరుద్యోగులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.



## 'కోర్ట్'ను కూడా యూనివర్స్‌గా మారుస్తారా?

తెలుగులో ఫ్రాంఛైజీ చిత్రాలకు ఊపు తెచ్చిన చిత్రం.. హిట్. నాని నిర్మాణంలో శైలేష్ కొలను రూపొందించిన 'హిట్: ది ఫస్ట్ కేస్' సక్సెస్ కావడంతో తర్వాత 'సెకండ్ కేస్' వచ్చింది. ఇప్పుడు నానినే హీరోగా 'హిట్-3' చేస్తున్నాడు. ఇదే స్టయిల్లో 'కోర్ట్' సినిమాను కూడా ఫ్రాంఛైజీగా మార్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.'కోర్ట్' మూవీని కూడా నానినే నిర్మించిన సంగతి తెలిసిందే. రామ్ జగదీష్ అనే కొత్త దర్శకుడు రూపొందించిన ఈ చిత్రం.. ఈ శుక్రవారమే విడుదలైన సూపర్ హిట్ టాక్ తెచ్చుకుంది. పేరుకున్న చిన్న సినిమానే కానీ దీనికి ప్రేక్షకుల నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ఈ వీకెండ్లో హౌస్ ఫుల్ కలెక్షన్లతో సినిమా రన్ అవుతోంది. ఈ నేపథ్యంలో నిర్వహించిన సక్సెస్ మీట్లో 'కోర్ట్'ను ఫ్రాంఛైజీగా మార్చడంపై నాని ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'కోర్ట్' సినిమా బాక్సాఫీస్ ఫ్లో చూస్తుంటే.. దీనికి సీక్వెల్ తీయాల్సిన అవసరం ఉందేమో అనిపిస్తోందని నాని అన్నాడు. 'కోర్ట్' ఇప్పుడు చిన్న సనిమానే కానీ.. సీక్వెల్ అనౌన్స్ చేస్తే మాత్రం అది పాన్ ఇండియా మూవీ అయిపోతుందని, పెద్ద రేంజికి చేరుకుంటుందని నాని అన్నాడు. 'కోర్ట్'ను కూడా 'హిట్' తరహాలోనే యూనివర్స్‌గా మారిస్తే బాగానే ఉంటుందని.. ఈ రెండు యూనివర్స్‌ల క్రాస్ ఓవర్ కూడా ప్లాన్ చేయొచ్చని.. దీన్ని తాను మైండ్‌లో పెట్టుకుంటానని నాని అన్నాడు.

# ఆ ఏడాదిలో పుష్ప 3 రిలీజ్ అని ప్రకటించేశారు

### కాని ఈ సినిమా ముందున్న సమస్యలు ఏంటంటే!

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, లెక్కల మాస్టారు సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కిన చిత్రం పుష్ప. ఈ మూవీ బాక్సాఫీస్‌ని షేక్ చేసింది. . ఏ మాత్రం అంచనాలు లేకుండా వచ్చిన ఈ సినిమా భారీ వసూళ్లు రాబట్టింది. ఇందులోని పాటలు, డైలాగులు, యాక్షన్ సీక్వెన్స్ కి ప్రతి ఒక్కరు ఫిదా అయ్యారు. క్రికెటర్స్ సైతం ఈ సినిమాలోని బన్నీ మేనరిజమ్స్ ఇమిటేట్ చేశారు. ఇక పుష్ప చిత్రం భారీ హిట్ కావడంతో పుష్ప2ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించారు. గతేడాది రిలీజైన పుష్ప 2 ఏకంగా ఇండియన్ సినిమా బాక్సాఫీస్ రికార్డులు కొల్లగొట్టి ఏకంగా రూ. 1800 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. అయితే పుష్ప 2 సినిమా ఎండింగ్ లో పుష్ప 3 కూడా ఉంటుందని మేకర్స్ హింట్ ఇచ్చారు. అయితే ఈ సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందో అని అభిమానులు ఆలోచనలో పడ్డారు. ఈ క్రమంలో పుష్ప 3 సినిమా గురించి నిర్మాత రవిశంకర్ ఆసక్తికర కామెంట్స్ చేశాడు. 2028లో పుష్ప 3 సినిమాను విడుదల చేస్తామని వెల్లడించాడు.ఇంత వరకు బాగానే ఉంది కాని బన్నీ సినిమా 2028కి రావాలంటే దీని ముందు కొన్ని సమస్యలు ఉన్నాయి. ప్రస్తుతం అల్లు అర్జున్ అట్లీ దర్శకత్వంలో ఒక సినిమా చేసేందుకు సిద్ధంగా ఉన్నాడు. ఈ సినిమా షూట్ పూర్తి చేసుకొని రిలీజ్ కావడానికి కనీసం ఏడాదైన పడుతుంది. అంటే అట్లీ బన్నీ సినిమా 2026 లోనే విడుదల అవుతుందని చెప్పాలి. ఇక త్రివిక్రమ్ కాంబినేషన్ లో చేసే భారీ మైథలాజికల్ సినిమా మేకింగ్ కు కనీసం రెండేళ్ల సమయం పట్టే అవకాశం ఉంది. అంటే 2028 లో ఆ సినిమా రావడానికి అవకాశం ఉంటుంది .ఒకవేళ త్రివిక్రమ్ శ్రీనివాస్ ఫాస్ట్‌గా లాగించిన కూడా 2027 చివరకు ఈ సినిమా వస్తుంది. ఈ సినిమా షూట్ అయిపోయాక పుష్ప 3 మొదలు పెట్టాలి. అంటే 2029 లో లేదంటే 2030లో పుష్ప 3 ని తెర మీద చూడాలి. అయితే అల్లు అర్జున్ మాత్రం ప్రస్తుతం మంచి జోష్ మీద ఉన్నారు. ముందు అయితే ఏదో ఒక సినిమాని ముందు రిలీజ్ చేయాలనే కసితో ఉన్నారు. ఆ తర్వాత త్రివిక్రమ్ సినిమా ముందు కానీ వెనుక కానీ వెళ్లే అవకాశం ఉంది. వేరే దర్శకులకి కూడా బన్నీ కమిటయ్యాడు. ఇవన్నీ దాటుకొని పుష్ప3 పూర్తి చేసి ప్రేక్షకుల ముందుకు తెచ్చే ప్లాన్ అయితే బన్నీ రెడీ చేసుకోవాలి. సినీ విశ్లేషకుల ప్రకారం ఎలా చూసినా కూడా పుష్ప 3 సినిమా విడుదల కావడానికి 2030 అవుతుందని అంటున్నారు.





## ఛావా మరో రికార్డు

విడుదలై నెలరోజులు దాటుతున్నా ఛావా పరుగులు ఆగడం లేదు. వీక్ డేస్ లో నెమ్మదించినప్పటికీ వారాంతం వస్తే చాలు విక్కీ కౌశల్ మళ్ళీ పేట్రేగిపోతున్నాడు. దీని తర్వాత చెప్పుకోదగ్గ బాలీవుడ్ మూవీ రాకపోవడం వసూళ్ల పరంగా కలిసి వస్తోంది. ఇటీవలే రిలీజైన జాన్ అబ్రహం ది డిప్లమాట్ కు మంచి టాక్ వచ్చినా కూడా అది కలెక్షన్లుగా మారలేకపోతోంది. ఆలస్యంగా రిలీజైనప్పటికీ ఛావా తెలుగు వెర్షన్ పదిహేను కోట్లను దాటేయడం చిన్న విషయం కాదు. ఒకవేళ కోర్ట్ కనక దూకుడుగా లేకపోయి ఉంటే మరాఠా వీరుడు పాతిక కోట్లను టార్గెట్ చేసేవాడే. కానీ మిస్సయ్యే సూచనలు ఎక్కువగా ఉన్నాయి.తాజాగా ఛావా మరో మైలు రాయి అందుకుంది. నెట్ కలెక్షన్ల పరంగా ఇండియన్ బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్స్ లో ఎనిమిదో స్థానానికి ఎగబాకింది. యానిమల్ (553 కోట్లు), జవాన్ (543 కోట్లు) ని దాటేసి ఛావా 555 కోట్లను అందుకుంది. ఇంకా ఫైనల్ రన్ కాలేదు కాబట్టి మరో వంద కోట్లకు పైగా అదనంగా తొడవ్వొచ్చని ఒక అంచనా. గ్రాస్ పరంగా చూసుకుంటే ఛావా 741 కోట్లతో చాలా స్ట్రాంగ్ గా ఉంది. ఓవర్సీస్ లోనూ 86 కోట్ల దాకా వసూలు చేయడం మరో రికార్డు. టాప్ 10లోకి ప్రవేశించిన ఛావా హీరో విక్కీ కౌశల్ కు తొలిసారి ఈ క్లబ్బులో చోటు సంపాదించి పెట్టింది. ఖాన్లు, కపూర్ల డామినేషన్ ని సవాల్ చేసే నెంబర్లు ఇచ్చింది. ఇక ఛావా ముందున్న నెక్స్ట్ టార్గెట్ వెయ్యి కోట్ల గ్రాస్. అదేమీ అసాధ్యం కాదు కానీ అలాని సులభము కాదు. ఇప్పటికే నెమ్మదించిన రన్ ని తిరిగి కొనసాగించాలంటే జనాన్ని మళ్ళీ థియేటర్లకు వచ్చేలా చేయాలి. ఒక వారం రోజులు అయ్యాక ఓటిటి స్ట్రీమింగ్ దగ్గర్లో ఉన్నప్పుడు ఆఫర్లు ప్రకటించాలని నిర్మాతలు ఆలోచిస్తున్నారట.




## హంస కూడా ఈ వయ్యారి సొగసుకి దాసోహం..

### ఫ్యాబులస్ కేతిక..

కేతిక శర్మ ఒక భారతీయ చలనచిత్ర నటి, ఆమె ప్రధానంగా తెలుగు చిత్రాలలో కనిపిస్తుంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ షేర్ చేసిన ఫోటోలకు సోషల్ మీడియాలో తెగ లైక్స్ వస్తున్నయి. మీరు కూడా వీటిని ఒక్కసారి చుడండి. కేతిక శర్మ ఒక భారతీయ చలనచిత్ర నటి, ఆమె ప్రధానంగా తెలుగు చిత్రాలలో కనిపిస్తుంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ షేర్ చేసిన ఫోటోలకు సోషల్ మీడియాలో తెగ లైక్స్ వస్తున్నయి. మీరు కూడా వీటిని ఒక్కసారి చుడండి. 24 డిసెంబర్ 1995న భారతదేశ రాజధాని ఢిల్లీ నగరంలో ఓ హిందూ కుటుంబంలో జన్మించింది వయ్యారి భామ కేతిక శర్మ. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలోని లా మార్టినియర్ బాలికల పాఠశాలలో స్కూలింగ్ విద్యను పూర్తిచేసింది ఈ ముద్దుగుమ్మ. ఢిల్లీ నగరంలో ఉన్న మిరాండా హౌస్, ఢిల్లీ విశ్వవిద్యాలయంలో తన గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది ఈ అందాల తార. చదువు పూర్తయ్యాక మోడలింగ్ లో తన కెరీర్ ను ప్రారంభించింది ఈ వయ్యారి. పలు బ్రాండ్ల ప్రకటనల్లో కనిపించింది. తన డబ్స్‌మాష్ వీడియో క్లిప్‌ల కారణంగా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దింతో సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ అయింది. 2021లో ఆకాష్ పూరికి జోడిగా రొమాంటిక్ అనే ఓ టాలీవుడ్ సినిమాతో చలనచిత్ర అరంగేట్రం చేసింది ఈ వయ్యారి భామ. తర్వాత లక్ష్య, రంగ రంగ వైభవంగా అనే చిత్రాల్లో హీరోయిన్ గా చేసింది. అయితే ఈ రెండు చిత్రాలు ఆకట్టుకోలేకపోయాయి. పవన్ కళ్యాణ్, సాయి ధరమ్ తేజ్ ప్రధాన పాత్రల్లో వచ్చిన బ్రో సినిమాలో కథానాయకిగా కనిపించింది.దీనికి పాజిటివ్ టాక్ వచ్చింది. ప్రస్తుతం శ్రీవిష్ణుకి జోడిగా చసింగల్ సినిమాలో నటిస్తుంది. అలాగే నితిన్ రాబిన్?హుడ్?లో స్పెషల్ సాంగ్?లో అలరించనుంది.

## విజయ్ దేవరకొండ అన్నయ్యగా సత్యదేవ్ ?



రౌడీ బాయ్ విజయ్ దేవరకొండ కెరీర్ లో అత్యంత భారీ బడ్జెట్ తో రూపొందుతున్న ప్యాన్ ఇండియా మూవీ కింగ్ డమ్ షూటింగ్ చివరి దశకు వస్తోంది. దర్శకుడు గౌతమ్ తిన్ననూరి దీన్ని తీర్చిదిద్దిన విధానం గురించి యూనిట్ చెబుతున్న లీకులు అంచనాలను అమాంతం పెంచేస్తున్నాయి. అవేంటనేది రిలీజ్ దగ్గర్లో ఉన్నప్పుడు చూసుకోవచ్చు కానీ ఒక ముఖ్యమైన అప్డేట్ ఆసక్తి రేపేలా ఉంది. ఇందులో సత్యదేవ్ ఓ కీలక పాత్ర చేస్తున్న సంగతి తెలిసిందే. ఇన్ సైడ్ టాక్ ప్రకారం తను విజయ్ దేవరకొండకు అన్నయ్యగా నటించాడట. శ్రీలంక తెగలో నాయకుడిగా ఆ క్యారెక్టర్ పవర్ ఫుల్ గా ఉంటుందని సమాచారం.సత్యదేవ్ మీద నడిచే ట్విస్టు ద్వారా విజయ్ దేవరకొండ ఆ సామ్రాజ్యానికి రావడమనే ఎపిసోడ్ చాలా హై ఇంటెన్స్ తో ఉంటుందని అంటున్నారు. టీజర్ లో చూపించిన విజువల్స్ లో తనవాళ్లు విలన్ల రక్తదాహానికి బలైతే మిగిలిన తెగను కాపాడేందుకు వచ్చిన లీడర్ గా విజయ్ ఇంటెన్స్ వేరియేషన్స్ చూపించడం గమనించాం. ఒక భాగమా లేక రెండు భాగాలు ఉంటుందానేది నిర్మాణ సంస్థ సితార ఇంకా రివీల్ చేయలేదు. గతంలో నాగవంశీ చెప్పిన ప్రకారం సీక్వెల్ వచ్చే ఛాన్స్ ఎక్కువగా ఉంది. ప్రస్తుతం హైదరాబాద్ షెడ్యూల్ కి షిఫ్ట్ అయిపోయిన కింగ్ డంకు అనిరుద్ రవిచందర్ సంగీతం సమకూరుస్తున్నాడు. మే 30 విడుదల కాబోతున్న కింగ్ డమ్ ప్రమోషన్లు వచ్చే నెల నుంచి ప్రారంభం కాబోతున్నాయి. ఎట్టి పరిస్థితుల్లో వాయిదా లేకుండా అన్ని ప్లానింగ్ ప్రకారం జరిగిపోతున్నాయి. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్ గా నటిస్తున్న ఈ హిస్టారికల్ డ్రామాలో శ్రీలంక ఎపిసోడ్లు టెర్రిఫిక్ గా వచ్చాయట.

Ediited Printed & Published Mekkonda Premraj  on behalf MPR publications and Printed  RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,